ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

3 సోమవారం 8 జూలై 2024





కుటుంబ సభ్యులతో లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దర్శించుకున్న డీజీపీ ద్వారక తిరుమలరావు

మూతపడిన విభాగాలు పునరుద్ధరణ

- ఎల్‌హెచ్‌ఎంఎస్, ఫింగర్ ప్రింట్ డివైజ్ ప్రారంభం
- పోలీసుల పనితీరులో పారదర్శకం, జవాబుదారీతనం
- గుంటూరులో డీజీపీ ద్వారక తిరుమలరావు

గుంటూరు, జూలై 7: గత ప్రభుత్వ హయాం లో కారణం ఏమైనప్పటికీ పోలీస్ శాఖలో కొన్ని విభాగాలు మూతపడ్డాయని, వాటిని పునరుద్ధరిస్తామని డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఆదివారం ఆయన గుంటూరు కృష్ణనగర్ లోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మూతపడిన ఫింగర్ ప్రింట్ డివైజ్‌ను పునరుద్ధరిస్తామని తెలిపారు. విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ డివైజ్‌ను వినియోగించి అక్కడికక్కడే నేరస్తులను గుర్తించవచ్చన్నారు. దీనితోపాటు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను కూడా పునరుద్ధరిస్తామన్నారు. ఈ విధానం ద్వారా ఎవరైనా ఊళ్లకు వెళుతుంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే ఎటువంటి ఖర్చు లేకుండా తామే ఆ ఇంటిలో రహస్యంగా కెమెరా అమర్చి వారు తిరిగివచ్చే వరకు కాపలాకాయడం జరుగుతుందని తెలిపారు. తద్వారా నేరాలను అరికట్టడంతో పాటు నేరస్తులను కూడా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. పౌర కేంద్రీకృత పోలీసింగ్‌ను అమలు చేయనున్నట్లు తెలిపారు. పోలీసుల పనితీరు పారదర్శకంగా, జవాబుదారితనంగా ఉండబోతుందన్నారు. పౌరులకు మరింతగా సేవలందించి ప్రజల మన్ననలు పొందేవిధంగా పోలీసుల పనితీరు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా సాంకేతికపరమైన ఆధారాల ఆధారంగా కేసుల దర్యాప్తు ఉంటుందన్నారు. మాజీ ప్రజా ప్రతినిధులకు భద్రత తొలగించిన విషయంపై విలేకర్ల ప్రశ్నకు డీజీపీ స్పందిస్తూ వారి భద్రతపై సమీక్షించి నిర్ణయం తీసుకుంటామన్నారు. పోలీస్ శాఖలో కిందిస్థాయి ఉద్యోగులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు.

జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న డీజీపీ

తన చిన్నతనంలో కృష్ణనగర్ ప్రాంతంలో నివాసం ఉండి ఇక్కడే చదువుకున్నట్లు డీజీపీ ద్వారక తిరుమలరావు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో కుటుంబ సమేతంగా నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించుకునే వాడినని చెప్పుకొచ్చారు. చిన్నతనంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉండేదని, ఆ తర్వాత క్రమంలో ఆలయాన్ని పునరుద్ధరించారని, ఆ తర్వాత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని కూడా నిర్మించినట్లు తెలిపారు. ఆ సమయంలోనూ తాను ఇక్కడకు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. తాను చిన్నతనంలో ఈ సమీపంలోనే నివాసం ఉండి ఈ ప్రాంతంలోనే చదువుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ ప్రతినిధి, విశ్రాంత ఏఎస్పీ కోటేశ్వరరావు, వెస్ట్ డీఎస్పీ మహేష్, పట్టాభిపురం సీఐ విజయచంద్రతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగణేశునిపాడులో భారీ చోరీ

- 50 సవర్ల బంగారం, 2.50 లక్షల నగదు, కేజీ వెండి అపహరణ

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు

- గంజాయి, కారును సీజ్ చేసిన పోలీసులు

5లో..

హ్యాపీనెస్ట్ భారం.. రూ. 164.5 కోట్లు





- ప్రాజెక్టును పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఐదేళ్లు కాలయాపనతో సీఆర్డీఏకు భారీ నష్టం
- ఎస్‌వోఆర్‌తో భవిష్యత్‌లో మరింత పెరిగే అవకాశం
- అదే పూర్తి చేసి ఉంటే రూ.57.37 కోట్ల లాభం వచ్చేది
- ప్రాజెక్టు పట్టాలెక్కుతుందనే ఆశలో ప్లాట్లు బుక్ చేసుకున్న వారు

హ్యాపీనెస్టు.. భారతదేశపు మొదటి గ్లోబల్ సిటీ ఆఫ్ ది ఫ్యూచర్‌గా ఉండేది. అమరావతి రాజధాని ప్రాంతంలో నివాసం ఉండేవారికి స్వచ్ఛమైన ఆనందాన్ని వెదజల్లేలా.. ఆధునికంగా.. పచ్చదనంతో అభివృద్ధి చేయాలని ఈ హ్యాపీనెస్టు ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రూపొందించారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర ప్రజలతో పాటు జాతికి గర్వకారణంగా ఉంటుందని అప్పటి పాలకులతో పాటు ప్రజలు కూడా భావించారు. దీంతో 12 టవర్లలో నిర్మాణం తలపెట్టిన ఈ హ్యాపీనెస్టు ప్రాజెక్టులోని 1200 ఫ్లాట్స్ కోసం అడ్వాన్స్‌లు చెల్లించి మరీ ముందస్తుగా బుకింగ్ చేసుకున్నారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం.. జగన్ ముఖ్యమంత్రి కావడంతో ఈ హ్యాపీనెస్టు ప్రాజెక్టుకు శాపమైంది. ఐదేళ్లు దీని గురించి వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. దీంతో తమ డిపాజిట్లును వెనక్కు ఇచ్చేయాలని పలువురు సీఆర్‌డీఏని కోరడంతో 2022లో పిల్లిమొగ్గలేసి సాగదీస్తూ వచ్చింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. అమరావతి రూపశిల్పి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో హ్యాపీనెస్టు ప్రాజెక్టు తిరిగి పట్టాలెక్కుతుందని పలువురు భావిస్తున్నారు. అయితే వైసీపీ ఐదేళ్ల పాలన కారణంగా ఈ ప్రాజెక్టుతో సీఆర్‌డీఏకు రూ.164.5 కోట్ల భారం మోయాల్సి వచ్చింది. ప్రాజెక్టు నిర్మాణం జరిగే కొద్దీ ఎస్‌వోఆర్ పెరిగే అవకాశం ఉండటంతో నష్టం కూడా పెరగనున్నది.

గుంటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఐకానిక్ సిటీగా అమరావతిని రూపొందించాలన్న నాటి పాలకుల ఆలోచనల నుంచి హ్యాపీనెస్టు ప్రాజెక్టు పుట్టింది. ఆధునికత.. లగ్జరీ.. సంప్రదాయాలు.. స్మార్ట్ లైఫ్‌స్టైల్‌ను మిళితం చేస్తూ ప్రపంచ స్థాయి వాతావరణాన్ని అందుబాటులోకి తెస్తూ.. 80 శాతానికిపైగా భూమిని సుందరమైన ప్రకృతి దృశ్యం చేరువ చేస్తూ హ్యాపీనెస్ట్ ప్రాజెక్టును సీఆర్‌డీఏ అమరావతి రాజధానిలోని నేలపాడు గ్రామంలో ప్రతిపాదించింది. అందులో నివాసం ఉండేందుకు ఫ్లాట్ల బుకింగ్ కోసం ప్రపంచ వ్యాప్తంగా పలువురు పోటీ పడ్డారు. అయితే హ్యాపీనెస్టు ప్రాజెక్టుపై వైసీపీ పాలకులు కత్తిదూశారు. ఈ ప్రాజెక్టు గురించి టీడీపీ ప్రభుత్వ హయాంలో సర్వత్రా చర్చ జరిగింది. 12 టవర్లలో నిర్మాణం తలపెట్టిన 1200 ఫ్లాట్స్‌కు రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న తెలుగువారి నుంచి కూడా విపరీతమైన స్పందన లభించింది. ఆన్‌లైన్‌లో బుకింగ్స్ ప్రారంభించగానే హాట్ కేక్‌ల్లా బుకింగ్ అయ్యాయి. అడ్వాన్స్‌లు చెల్లించి మరీ ముందస్తుగా బుకింగ్ చేసుకున్నారు. ఆ ప్రాజెక్టు పూర్తి అయి ఉంటే ఈ పాటికే ఆ ఒక్క హ్యాపీనెస్టులోకే 1200 కుటుంబాలు వచ్చి నివాసం ఉండేవి. అయితే వైసీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో హ్యాపీనెస్టుని పక్కన పెట్టేసింది. దీంతో ఇప్పుడు ఆ ప్రాజెక్టు నిర్మాణ ఖర్చు గణనీయంగా పెరిగింది. 2024-25 ఎస్‌వోఆర్ ప్రకారం దాదాపుగా రూ.885 కోట్లను వెచ్చించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఇది ప్రాజెక్టు ప్రారంభంలో వేసిన అంచనా విలువ రూ.720.5 కోట్లతో పోల్చితే దాదాపుగా రూ.164.5 కోట్లు అదనం. ఇప్పుడు ఈ మొత్తాన్ని ఏపీసీఆర్‌డీఏ భరించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది.



నేలపాడులో నిర్మించాల్సిన 12 బ్లాకుల హ్యాపీనెస్ట్ టవర్స్

చంద్రబాబు ఆమోదం.. జగన్ ద్రోహం

అమరావతి రాజధాని నగరానికి గత సీఎం జగన్ చేసిన ద్రోహం అంతా ఇంతా కాదు. రాజధానికే కాకుండా ఇక్కడ నివాసం ఉండాలని ఆలోచన చేసిన వారికి కూడా తీరని అన్యాయాన్నే చేశారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో రెసిడెన్షియల్ బిల్డింగ్స్ నిర్మాణంలో జోరు పెంచేందుకు ఏపీసీఆర్‌డీఏ హ్యాపీనెస్టు ప్రాజెక్టుని నిర్మాణం చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి డీపీఆర్‌ని రూపొందించి ఆన్‌లైన్‌లో ఉంచింది. నేలపాడులోని 14.46 ఎకరాల విస్తీర్ణంలో సకల సదుపాయాలతో ఈ హ్యాపీనెస్టు ప్రాజెక్టుని ఒక రోల్‌మోడల్‌గా నిర్మించాలని భావించింది. 19 అంతస్తులతో ఒక్కో టవర్ నిర్మాణం చేయాలని నిర్ణయించింది. 1225, 1295 ఎస్‌ఎఫ్‌టీ విస్తీర్ణంలో 2 బీహెచ్‌కే ఫ్లాట్స్, 1510, 1590, 1630, 1710, 1870, 1980, 2120, 2245, 2640, 2750 ఎస్‌ఎఫ్‌టీలలో 3 బీహెచ్‌కే ఫ్లాట్స్‌ని నిర్మించేందుకు ప్లాన్ కూడా ఆమోదం లభించింది. ఇందులోనే ఎయిర్ కండీషన్ జిమ్, క్రికెట్ ప్రాక్టీసు నెట్స్, స్కేటింగ్ రింగ్, రాక్ క్లయింబింగ్, ఏసీ మల్టీపర్పస్ హాల్, పార్టీ లాన్, లాంజ్, సెలూన్, ఏరోబిక్స్ హాల్, బ్యాడ్మింటన్ కోర్టులు, యోగా రూం, స్క్వాష్ కోర్టు, స్విమ్మింగ్ పూల్, టేబుల్ టెన్నిస్, క్లినిక్, ఫార్మసి డెస్కు, యాంపిథియేటర్, ధాన్యం వనం, జాగింగ్, రన్నింగ్ ట్రాక్, ఏటీఎంలు, బిజినెస్ సెంటర్‌లు, సూపర్ మార్కెట్‌లు వంటి సకల సదుపాయాలను నిర్మించేందుకు ప్లాన్స్ ఆమోదం పొందాయి. ఈ కారణంగానే 1200 ఫ్లాట్స్‌లో 1,187 ఇట్టే బుకింగ్ అయిపోయాయి. దీని నిర్మాణం పూర్తి అయితే సీఆర్‌డీఏకి రూ.57.37 కోట్ల లాభం కూడా వస్తుందని అప్పట్లో అంచనా వేశారు. ఈ ప్రాజెక్టుకి సంబంధించి ఏజెన్సీని కూడా అప్పట్లో సీఆర్‌డీఏ ఖరారు చేసింది. అయితే గత వైసీపీ ప్రభుత్వం వస్తూనే టెండర్లు రద్దు చేసింది. దాంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఈ క్రమంలో ఫ్లాట్స్ బుకింగ్ చేసుకున్న చాలామంది తమ డిపాజిట్లు వెనక్కు ఇచ్చేయాలని సీఆర్‌డీఏని కోరారు. దాంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022లో సీఆర్‌డీఏ తాను హ్యాపీనెస్టుని నిర్మిస్తానని పిల్లిమొగ్గలేసింది. ఏజెన్సీని కూడా ఖరారు చేయనున్నట్లు ప్రకటించింది. అయితే అది ఎంతమాత్రం కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు దీనిపై ప్రభుత్వం రూ.164.5 కోట్ల భారం మోయాల్సిన పరిస్థితి. ప్రాజెక్టు నిర్మాణం జరిగే కొద్దీ ఎస్‌వోఆర్ పెరిగే అవకాశం ఉండటంతో నష్టం కూడా పెరుగుతుంది.

కబ్జా.. కష్టమే..



- భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు వినతి
- సమీకృత హాస్టల్‌పై నాడు కన్నేసిన వైసీపీ నేత
- ప్రస్తుతం ఆ నేత మాజీ.. ఇప్పటికైనా కొలిక్కివచ్చేనా
- 90 శాతం పనులు పూర్తి.. 500 మందికి వసతి సౌకర్యాలు

గుంటూరు(విద్య), జూలై 7: కుల మతాలకు అతీతంగా విద్యార్థులకు వసతి కల్పించి వారి విద్యాభివృద్ధికి బాటలు వేయాలనే మహోన్నత లక్ష్యంతో సమీకృత భవన నిర్మాణం చేపట్టారు. అయితే ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ పాలకులు దానిని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. అయితే అప్పట్లోనే విద్యార్థులు, ప్రజాసంఘాలు అడ్డుకోగా ఆ నేత వెనక్కి తగ్గారు. అయినా లీజు పేరుతో కబ్జా పాలవుతుందని విద్యార్థులు ఆందోళనలో ఉన్నారు. అయితే తాజా ఎన్నికల్లో మాజీగా మారడంతో ఆ నేత మాస్టర్‌ప్లాన్‌కు చెక్ పడింది. ఇదీ గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియం ఎదురుగా ఉన్న సమీకృత (ఇంటిగ్రేటెడ్) హాస్టల్ భవనం కథ. గతంలో ఈ ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రత్యేకంగా మూడు వసతి గృహాలు ఉండేవి. వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు మూడో తరగతి నుంచి 10వ తరగతి స్థాయి వరకు 400 మంది విద్యార్థులకు వసతి కల్పించేవారు. ఇదే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల కూడా ఉండేది. కాలక్రమేణ ఇక్కడ భవనాలు శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం ఇక్కడ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకు తగ్గట్లు 2013కు ముందున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత టీడీపీ ప్రభుత్వం ఈ భవన నిర్మాణానికి రూ.5 కోట్లు నిధులు కేటాయించింది. పనులు ప్రారంభమైన రెండేళ్లకు 90 శాతం పూర్తి చేశారు. ఆ తర్వాత 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ భవన నిర్మాణం గురించి పట్టించుకోలేదు. దీంతో పనులు నత్తనడకన సాగాయి. ఈ భవనం పూర్తి అయితే దాదాపు 500 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర సామాజికవర్గాల విద్యార్థులకు వసతి కల్పించే అవకాశం ఉండేదని అధికారులు చెప్పారు.



భవనం లోపల ఉన్న ఫ్లోరింగ్ మెటీరియల్

అయినా వైసీపీ పాలకులు ఈ పనులపై దృష్టి సారించలేదు. మిగిలిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేయాల్సిన వైసీపీ నేత లీజు పేరుతో కబ్జా చేసి షాపింగ్ మాల్‌గా భవనాన్ని మార్చాలని స్కెచ్ వేశారు. బీఆర్ స్టేడియం ఎదురుగా వ్యాపార కూడలిలో ఉన్న ఈ భవనాన్ని లీజు పేరుతో కబ్జా చేయాలని అప్పట్లో ప్రయత్నించాడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన ఈ స్థలాన్ని, బిల్డింగ్‌ను స్వాధీనం చేసుకుని షాపింగ్‌మాల్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యాడు. ఈ గలీజు ఆలోచన విషయం తెలిసిన విద్యార్థి, ప్రజాసంఘాలు అప్పట్లో పెద్దఎత్తున ఆందోళనకు దిగాయి. దీంతో ఆ నేత వెనక్కి తగ్గాడు. వందల మంది విద్యార్థులకు వసతి కల్పించే భవనాన్ని షాపింగ్‌మాల్‌గా మార్చాలనుకున్న ఆ నేత ఇటీవల జరిగిన ఎన్నికల్లో మాజీ అయ్యాడు. దీంతో ఈ భవనం కబ్జా కోరల నుంచి బయటపడింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అరకొర మిగిలిన పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని విద్యార్థి సంఘాల నేతలు కోరుతున్నారు. ఈ మేరకు అధికారులకు ప్రజలు, విద్యార్థి సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నారు.



జీఆర్‌స్టేడియం ఎదురుగా నిర్మాణం పూర్తి అయిన సమీకృత హాస్టల్ భవనం

అడిగితే.. బుకాయింపు

- జిల్లాలో అధికారుల వింత ప్రవర్తన
- సమాచారం ఇవ్వరు.. సమాధానం చెప్పరు
- వైసీపీ హయాంలో అవకతవకలపై గందరగోళం

బాపట్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆ విషయమా.. మాకు తెలియదనో.. లేదంటే తాము అప్పట్లో లేమనో చెప్పడం జిల్లాలోని వివిధ శాఖల అధికారులకు పరిపాటిగా మారింది. ముఖ్యంగా ఐదేళ్ల వైసీపీ హయాంలో జరిగిన అవకతవకలకు సంబంధించి ఆరా తీసేందుకు ప్రయత్నించే వారికి అధికారులు బుకాయింపుతో సరిపెడుతున్నారు. ప్రభుత్వ వ్యవహారాలకు సంబంధించి ప్రతి అంశం రికార్డుల్లో నిక్షిప్తం చేయడమో లేక ఆన్‌లైన్ చేయడమో జరిగి ఉండాలి. కాని ఐదేళ్ల వైసీపీ పాలనకు సంబంధించి ఏ ఒక్క సమాచారం అడిగినా అధికారుల వద్ద నుంచి సానుకూల స్పందన లేదు. పైగా బుకాయింపు ధోరణి అవలంబిస్తుండడం విస్మయం కలిగిస్తోంది. అధికారి ఎవరైనా కావచ్చుకాక రికార్డు నిర్వహించే ఉంటారుగా అంటే సమాధానం ఉండడం లేదు. ఇదీకాదు అంటే కొన్ని అంశాలకు సంబంధిచి ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన అని సమాధానం చెప్పి తప్పుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే గడచిన ఐదేళ్లకు సంబంధించిన వివరాలు కూడా నమోదు చేయకుండా అడ్డగోలుగా వ్యవహరించారేమో అన్న అనుమానం కలుగుతోంది. లేదంటే వాటిని బయటకు పొక్కనీయకుండా ఇంకా వైసీపీ నేతల సేవలో తరించడానికి కొంతమంది అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారా అనేది తేలాల్సి ఉంది. కీలకమైన అంశాలకు సంబంధించిన సమాచారం కూడా ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉండకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఒక వేళ ప్రస్తుత అధికారులు చెబుతున్నట్లు అసలు రికార్డుల్లో నమోదు చేయలేనంత నిర్లక్ష్యాన్ని పాత అధికారులు ప్రదర్శించి ఉంటే వారిపై చర్యలకు కూడా సిఫార్సు చేసే అవకాశం ఉంది. కానీ ఇలాంటిదేమీ లేకుండా అన్నింటికి ఒక్కటే సమాధానంగా వివరాలు లేవు అని సరిపెట్టడం అంటే పరోక్షంగా వైసీపీ దోపిడీకీ ఇప్పుడున్న అధికారులు కూడా సహకరించినట్లే అవుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఖర్చుచేసిన జడ్పీ నిధుల వివరాలు కూడా జిల్లా కేంద్రంలో లేవు. సీపీవో కార్యాలయం జడ్పీ తీర్మానాలతో పాటు నిధుల మంజూరు వివరాలన్నీ నమోదు చేయాలి. కానీ ఆ విషయంలోనూ నిర్లక్ష్యమే.



బాపట్ల మున్సిపాలిటీలో వింత వైఖరి..

గత ప్రభుత్వంలో జగనన్న కాలనీ లకు భూసేకరణ పేరిట అవకతవ కలకు పాల్పడడంతో పాటు, అనర్హులు ఎంతోమందికి ప్లాట్లు ఇచ్చారనేది ఆరో పణ. అప్పటి కమిషనర్ ప్యాలెస్ లాంటి ఇంటిని జగనన్న కాలనీ పక్కనే నిర్మించుకోవడం, ఈయనతో పాటు మరికొంత మంది ఉద్యోగులు కూడా ఇక్కడే స్థలాలు కొనుక్కోవడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. జగనన్నకాలనీ అయితే నిర్మాణం కాలేదు కానీ కమిషనర్ ఇల్లు మాత్రం సర్వహంగులతో ఎప్పుడో కొలువుదీరింది. జగనన్నకాలనీల లబ్ధిదారుల జాబితా లేదనే జవాబుతో పాటు భూసేకకరణకు సంబంధించిన లావాదేవీల వివరాలు కూడా మున్సిపాలిటీలో లేవనే సమాధానం రావడం విస్మయపరుస్తోంది. స్థలం పొందడానికి తెల్ల కార్డును ప్రామాణికంగా అప్పటి ప్రభుత్వం తీసుకుంది. కానీ ఈ నిబంధనలేవీ పాటించకుండా వైసీపీ వీర విధేయులే లబ్ధి పొందారని, వీరితో పాటు హౌసింగ్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి బినామీ పేర్లతో 7 ఇళ్లను చేజిక్కించుకున్నారన్న ప్రచారం కూడా ఉంది.

సహకార సొసైటీలదీ అదేదారి..

జిల్లాలో ఉన్న 112 సొసైటీల్లో ఉన్న నిధులను ఇష్టానుసారం వైసీపీ నేతలు బొక్కేశారని టీడీపీ ఆరోపిస్తోంది. ఇందుకు సంబంధించి రెండుమూడు సొసైటీల్లో గతంలోనే ఆధారాలతో వైసీపీ నేతలు చేసిన బాగోతాలు వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఐదేళ్లలో ఆయా సొసైటీల నుంచి రుణాల పొందిన వారిజాబితా కావాలన్నా కూడా లేదనే సమాధానం రావడం విస్మయపరుస్తోంది. పైగా రుణాలు ఇచ్చేది సెంట్రల్ బ్యాంకులో కనుక అక్కడ మాత్రమే సమాచారం ఉంటుందనే వింత వాదనను అధికారులు చేయడం కొసమెరుపు.

స్పందన అర్జీలపైనా అదే వైఖరి..

గత ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహించిన స్పందనలో కూడా వైసీపీ అక్రమాల మీద పెద్ద ఎత్తున అర్జీలు వచ్చేవి. అప్పట్లో వాటిని పరిష్కరించి డిస్పోజ్ చేశామనే సమాధానమే అధికారుల నుంచి వచ్చేది తప్పితే వివరాలు బహిర్గతం చేసేవారు కాదు. ప్రస్తుతం ఆయా శాఖలలో గతంలో స్పందనలో వచ్చిన అర్జీల వివరాలు కూడా లేవని, అవన్నీ డిలీట్ అయ్యాయని చెప్పడం బాధ్యతారాహిత్యానికి పరాకాష్టగా నిలిచింది.

దిక్సూచి DIKSUCHI

జాతీయ అత్యవసర పరిస్థితి (1975)
ఒక సమగ్ర అవగాహన



ఇటీవల 18వ లోక్‌సభ కొలువుతీరిన తొలి రోజున భారతదేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి విధించి 49 ఏళ్లు కావస్తున్న సందర్భంగా ప్రధాని ఆనాటి దుర్భర పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడిన యోధులకు నివాళి అర్పించారు. అదేవిధంగా స్పీకర్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెడుతూ 1975 నాటి అత్యవసర పరిస్థితి కాలాన్ని భారతదేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా వర్ణించారు. సభలో ప్రతిపక్షాల నిరసనల మధ్య సభ వాయిదా పడింది. ఈ సంఘటన 1975 నాటి జాతీయ అత్యవసర పరిస్థితిపై దేశప్రజలందరూ దృష్టిసారించేలా చేసింది. ఈ నేపథ్యంలో 1975 నాటి జాతీయ అత్యవసర పరిస్థితి విధింపునకు కారణాలు, ఎమర్జెన్సీ కాలపు నిరంకుశ పద్ధతులు, రాజ్యాంగ సవరణలు, తదనంతర కాలంలో తీసుకొచ్చిన రాజ్యాంగ మార్పులు తదితర అంశాలపై అవగాహన అవశ్యకం.

భారత రాజ్యాంగంలో అత్యవసర పరిస్థితి నిబంధనల చేర్పు

ఏవైనా అంతర్గత లేదా బాహ్య కారణాలు లేదంటే ఆర్థిక పరిస్థితుల కారణంగా దేశ భద్రత, ఐక్యత, సమగ్రతలకు భంగం వాటిల్లే అవకాశం ఉంటే ఆ పరిస్థితులనే అత్యవసర పరిస్థితులుగా పరిగణిస్తారు. వీటిని ఎదుర్కొనడానికి, దేశాన్ని ఏకతాటిపై ఉంచడానికి కేంద్రానికి ప్రత్యేక అధికారాలు అవసరమని, ఆ అధికారాలను రాజ్యాంగ నిబంధనల పరంగా అందించాలని డా.బీ.ఆర్. అంబేద్కర్, టీ.టీ.కృష్ణమాచారి, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ వంటి న్యాయ కోవిదులు రాజ్యాంగ రచన సమయంలో భావించారు. ఈ అధికారాల నిరంకుశత్వాన్ని గ్రహించిన ప్రొ.కె.టి. షా, పీ.డీ.దేశ్‌ముఖ్, హెచ్.వీ.కామత్ వంటివారు వ్యతిరేకించడంతో వీటిని ప్రయోగించాల్సిన పరిస్థితులు పెద్దగా రాకపోవచ్చని, అన్యథా అవసరాల కోసమే వీటిని క్రోడీకరిస్తున్నామని వీటిని మృతాక్షరాలుగా పేర్కొనవచ్చని రాజ్యాంగ పరిషత్ చర్చల్లో అంబేద్కర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ 1975 నుంచి 1977 మధ్యకాలంలో 21 నెలలు దేశం చూసిన చీకటి రోజులు అంబేద్కర్ ఆకాంక్షకు గండికొట్టాయి.

> అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పంజాబ్‌లో అకాళీ దళ్ ఆధ్వర్యంలో 'డెమోక్రసీ బచావో మోర్చా' ఉద్యమం తీవ్రరూపు దాల్చింది. దీనితో ఒక్క పంజాబ్‌లోనే నలభైవేలమందిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది సభ్యులు, ఉద్యమకారులు జైళ్లపాలయ్యారు.

భారతదేశంలో 1975 నాటి అత్యవసర పరిస్థితి-పరిణామాలు

1971లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఇందిరా గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నియోజక వర్గం నుంచి పోటీచేసి విజయం సాధించారు. ఎన్నికల సమయంలో ఆమె ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951ని ఉల్లంఘించారని, నిబంధనలకు వ్యతిరేకంగా తన ప్రచార కార్యక్రమాలకు ప్రభుత్వ వనరులను పెద్ద ఎత్తున వినియోగించారు కాబట్టి ఇందిర ఎన్నిక చెల్లదని ఆమె ప్రత్యర్థి రాజ్ నారాయణ్ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. 1975 జూన్ 12న అలహాబాద్ హైకోర్టు ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123(7) ప్రకారం ఇందిరాగాంధీ చర్యలను చట్ట ఉల్లంఘనగా పేర్కొంటూ, ఎన్నిక చెల్లదని స్పష్టం చేసింది. అలాగే ప్రధానిగా కొనసాగరాదని, ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆరేళ్ల నిషేధం వర్తిస్తుందని తీర్పు చెప్పింది.

ఈ తీర్పును సవాల్ చేస్తూ ఇందిరాగాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 1975 జూన్ 24న సుప్రీంకోర్టు ఇందిరాగాంధీ ప్రధానిగా కొనసాగవచ్చని అయితే ఆమె పార్లమెంట్‌లో జరిగే ఏ ఓటింగ్‌లోనూ పాల్గొనరాదని, ఎంపీగా ఆమెకు లభిస్తున్న అన్ని సదుపాయాలను నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.

అప్పటికే దేశంలో అనేక ప్రాంతాల్లో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల్లో అవినీతి; నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆర్థిక సంక్షోభాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అశాంతి మొదలైంది. 1979లో గుజరాత్‌లో 'నవ నిర్మాణ్ ఆందోళన్', బిహార్‌లో జయప్రకాష్ నారాయణ్ ఉద్యమం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు, మధ్యతరగతి ప్రజలు భారీగా ఈ ఉద్యమాల్లో పాల్గొన్నారు. దేశంలోని అన్ని విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు మద్దతునిచ్చాయి. నవ నిర్మాణ్ ఉద్యమం కారణంగా గుజరాత్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయింది. జార్జి ఫెర్నాండెజ్ నేతృత్వంలో పెద్ద ఎత్తున రైల్వే సమ్మె నిర్వహించారు. ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హై కోర్టు తీర్పునివ్వడం ఈ పరిస్థితులకు ఆజ్యం పోసింది. ఇందిరాగాంధీ రాజీనామా కోసం విపక్షాలు పట్టుబట్టాయి.

సుప్రీంకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు పొంది

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ప్రధానిగా కొనసాగే అనుమతిని ఆమె తెచ్చుకోవడంతో తరవాతి రోజు 1975 జూన్ 25న ప్రతిపక్ష పార్టీలు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. పోరాటం తీవ్రం చేసేందుకు నిర్ణయించాయి. ఇటువంటి అననుకూల పరిస్థితుల్లో 1975 జూన్ 25 అర్ధరాత్రి జాతీయ అత్యవసర పరిస్థితి విధించారు. మంత్రిమండలిని సంప్రదించకుండానే రాష్ట్రపతికి అత్యవసర పరిస్థితి విధించాల్సిందిగా ఇందిరాగాంధీ సిఫార్సు చేశారు. ప్రతిపక్షాలను అణచివేసి తాను పదవిలో కొనసాగేందుకే రాజ్యాంగ ప్రకరణ 352లో ఉన్న 'అంతర్గత కల్లోలం' అనే పదాన్ని వక్రీకరించి అత్యవసర పరిస్థితి విధించారనే అపకీర్తిని ఇందిర మూటగట్టుకున్నారు. ఈ అత్యవసర పరిస్థితి కాలంలో ఆచరించిన అనేక నిరంకుశ విధానాలు కూడా తీవ్ర విమర్శలకు గురయ్యాయి.

1975 అత్యవసర పరిస్థితి కాలం నాటి వివిధ పరిణామాలు

అత్యవసర పరిస్థితి విధించిన కొన్ని గంటల్లోనే అనేక రాజకీయ పార్టీల నాయకులు అరెస్ట్ అయ్యారు. విజయ రాజే సింధియా, జయప్రకాష్ నారాయణ, ములాయం సింగ్ యాదవ్, మొరార్జీ దేశాయ్, చరణ్ సింగ్, జార్జ్ ఫెర్నాండెజ్, అటల్ బిహారీ వాజపేయి, జ్యోతిబసు, అద్వానీ, అరుణ్ జైట్లీ వంటి పలువురు ప్రముఖులు వీరిలో ఉన్నారు. వీరందరూ ప్రధానంగా 'మీసా'(ఎంఐఎస్‌ఏ- మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్), డీఐఎస్ఐఆర్(డిఫెన్స్ ఆఫ్ ఇండియా యాక్ట్ అండ్ డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్), సీఓఎఫ్ఈపీఓఎస్ఏ(కన్జర్వేషన్ ఆఫ్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ అండ్ ప్రివెన్షన్ ఆఫ్ స్మగ్లింగ్ యాక్టివిటీస్ యాక్ట్) వంటి కఠిన చట్టాల కింద అరెస్టయ్యారు. జమాతే ఇస్లామీ, ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలపై నిషేధం విధించారు.

అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పంజాబ్‌లో అకాళీ దళ్ ఆధ్వర్యంలో 'డెమోక్రసీ బచావో మోర్చా' ఉద్యమం తీవ్రరూపు దాల్చింది. దీనితో ఒక్క పంజాబ్‌లోనే నలభైవేలమందిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది సభ్యులు, ఉద్యమకారులు జైళ్లపాలయ్యారు.

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

దిశలు - దూరాలు


రీజనింగ్



ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

పార్ట్-2

ముఖ్య రేఖాచిత్రం




నోట్: ఈ చాప్టర్‌కు సంబంధించి అడిగే ప్రశ్నలకు పై రేఖాచిత్రంలో మిడిల్ పాయింట్‌ని బేసిక్‌గా తీసుకోవాలి. పై రేఖాచిత్రంలో మిడిల్ పాయింట్‌ని బేసిక్‌గా తీసుకొంటే మిడిల్ పాయింట్‌కు కుడివైపు అంటే తూర్పు, ఎడమవైపు అంటే పడమర, పై వైపు అంటే ఉత్తరం, కిందవైపు అంటే దక్షిణానికి అని అర్థం.

1. వినయ్ 40మీ. పడమరకు నడిచిన తరవాత దక్షిణం వైపునకు తిరిగి 30మీ. నడిచాడు. తదుపరి మరల తూర్పునకు 25మీ. నడిచిన తరవాత ఉత్తరానికి తిరిగి 20మీ. నడిచాడు. తదుపరి మరల తూర్పునకు తిరిగి 15 మీ॥ నడిచాడు. అయితే ఇప్పుడు వినయ్ బయలుదేరిన స్థానం నుంచి ఎంతదూరంలో ఏ దిశలో ఉన్నాడు?

ఎ) ఉత్తరం 10 మీ. బి) దక్షిణం 10 మీ.
సి) తూర్పు 10 మీ. డి) పడమర 10 మీ.

సమాధానం: (బి)

వివరణ:



పై రేఖాచిత్రంలో బయలుదేరిన స్థానం (L)నకు, చేరుకున్న స్థానం (M) కిందకు ఉంది.

ముఖ్యరేఖాచిత్రం(మెయిన్ డయాగ్రమ్)ను పరిశీలిస్తే మిడిల్ పాయింట్ నుంచి కిందకు అంటే దక్షిణం అని చెప్పారు. అంతేకాక పై రేఖాచిత్రాన్ని బట్టి వినయ్ బయలుదేరిన స్థానం నుంచి 10 మీ. దూరంలో ఉన్నాడని తెలుస్తుంది. సమాధానం దక్షిణం 10 మీ.

షార్ట్‌కట్: ముందుగా ప్రశ్నలో ఇచ్చిన సమాచారాన్ని రాసుకోవాలి. అది ఏమంటే పడమర 40, దక్షిణం 30, తూర్పు 25, ఉత్తరం 20, తూర్పు 15. తరవాత ఒకే దిశకు సంబంధించినవి రెండు లేదా అంతకంటే ఎక్కువసార్లు ఉంటే కూడాలి. పై సమాచారంలో తూర్పు 25, తూర్పు 15 లను కూడితే తూర్పు 40 అవుతుంది. ఇప్పుడు పై సమాచారం కింది విధంగా ఉంటుంది.

$పడమర_{40}$, $దక్షిణం_{30}$, $తూర్పు_{40}$, $ఉత్తరం_{20}$.


ఇప్పుడు వ్యతిరేక దిశల విలువ సమానంగా ఉంటే అది క్యాన్సిల్. పై సమాచారంలో $పడమర_{40}$, $తూర్పు_{40}$లు క్యాన్సిల్ అవుతాయి. మిగిలిన రెండింటిలో ఏది ఎక్కువ, ఎంత ఎక్కువ అదే సమాధానం అవుతుంది. $తూర్పు_{40}$, $పడమర_{40}$ క్యాన్సిల్ అవగా మిగిలిన $దక్షిణం_{30}$, $ఉత్తరం_{20}$ లలో $దక్షిణం_{10}$ ఎక్కువ ఉంది అదే సమాధానం అవుతుంది.

2. వినోద్ 5మీ. ఉత్తరానికి నడిచిన తరవాత కుడివైపునకు తిరిగి 6మీ. నడిచాడు. తదుపరి మరల ఎడమవైపునకు తిరిగి 3 మీ. నడిచాడు. అయితే ఇప్పుడు వినోద్ బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఉన్నాడు?

ఎ) 10 మీ. బి) 14 మీ. సి) 12 మీ. డి) 18 మీ.

సమాధానం: (ఎ)

వివరణ:



D- బయలుదేరిన స్థానం, E- చేరుకున్న స్థానం.

DF- ఒక భుజము 6 మీ॥. EF- మరో భుజము 8 మీ॥ (5 + 3)

DE- కర్ణము

పైథాగరస్ సిద్ధాంతం ప్రకారం $కర్ణము^2 = భుజము^2 + భుజము^2$

$$కర్ణము^2 = 6^2 + 8^2$$
$$కర్ణము^2 = 36 + 64$$
$$కర్ణము^2 = 100$$
$$కర్ణము = \sqrt{100} = 10 మీ॥$$

వినోద్ బయలుదేరిన స్థానం (D)కు చేరుకున్న స్థానం (E) 10 మీ. దూరంలో ఉంది.

3. A, B, C, D అనే నలుగురు బల్లకు నాలుగు వైపుల కూర్చొని క్యారమ్స్ ఆడుతున్నారు. B, D భాగస్వాములు. A ఉత్తరానికి ముఖభాగం కలిగి ఉన్నాడు. D తూర్పునకు ముఖభాగం కలిగి ఉన్నాడు. అయితే దక్షిణానికి ముఖభాగం కలిగి ఉన్న వ్యక్తి ఎవరు?

ఎ) B బి) C సి) చెప్పలేం డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: A, B, C, D నలుగురు నాలుగువైపులా కూర్చుంటారు. ఎదురెదురు వ్యక్తులు భాగస్వాములౌతారు. B, D భాగస్వాములని చెప్పారు. కాబట్టి A, C మరొక భాగస్వాములు అవుతారు. A ఉత్తరానికి ముఖభాగం కలిగి ఉన్నాడని ప్రశ్నలో చెప్పారు. A, Cలు భాగస్వాములు కనుక దక్షిణానికి ముఖభాగం కలిగి ఉన్న వ్యక్తి 'C' అవుతారు.

సమాధానం: సి



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్, సీనియర్ ఫ్యాకల్టీ

ఆర్‌డబ్ల్యూఎస్‌లో అడ్డగోలుతనం

- వైసీపీ హయాంలో పదోన్నతుల్లో ఇష్టారాజ్యం
- వీరభక్త అధికారులకు వరుస పదోన్నతులు
- ఓ డీఈఈ కేడర్ అనతికాలంలో సీఈగా..
- సుప్రీం, హైకోర్టు మార్గదర్శకాలు బేఖాతర్
- ఐదేళ్లూ భయంతో నోరెత్తని బాధిత ఉద్యోగులు
- కూటమి ప్రభుత్వం రావడంతో ఫిర్యాదులు
- వైసీపీ అస్మదీయ అధికారుల భారీ అవినీతి
- భారీ విల్లాలు, బహుళ అంతస్తుల భవనాలపై విచారణ జరిపించాలని కాంట్రాక్టర్ల వినతి
- డిప్యూటీ సీఎం పవన్‌కు ఫిర్యాదుల వెల్లువ

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా పదోన్నతులు కల్పించారు. సీనియారిటీని తుంగలో తొక్కి నిబంధనలకు విరుద్ధంగా కొందరు అధికారులకు ప్రమోషన్ ఇచ్చారు. వైసీపీకి వీరవిధేయులుగా ఉన్న వారికి నాటి ప్రభుత్వ పెద్దల సిఫార్సులతో అతి తక్కువ కాలంలోనే పదోన్నతుల మీద పదోన్నతులు కల్పించారు. సంస్థను అవినీతి మేతగా మార్చేశారు. పదోన్నతుల విషయంలో అన్యాయం జరుగుతున్నా అప్పట్లో ఏ ఒక్క అధికారి కూడా ఎదిరించలేకపోయారు. బాధిత అధికారులు కోర్టును ఆశ్రయించినా ఖాతరు చేయకుండా అయినవాళ్లకు అడ్డగోలుగా పోస్టుల సంతర్పణ చేశారు. ఐదేళ్లూ మౌన వేదన అనుభవించిన అధికారులు కూటమి ప్రభుత్వం రావటంతో జరిగిన అన్యాయాలపై గొంతెత్తుతున్నారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ పెద్దల అండదండలతో తమకు తీరని అన్యాయం చేసిన వైసీపీ వీరవిధేయ అధికారులపై తాజాగా డిప్యూటీ సీఎం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు బాధిత అధికారులు ఫిర్యాదులు చేశారు. పలువురు కాంట్రాక్టర్లు కూడా అవినీతి అధికారులపై విచారణకు ఆదేశించాలని ఫిర్యాదులు చేశారు. దీన్నిబట్టి గ్రామీణ నీటి సరఫరా విభాగాన్ని వైసీపీ పెద్దలు అవినీతి మేతతో ఎంతగా నిర్వీర్యం చేశారో, వ్యవస్థను ఎంత భ్రష్టుపట్టించారో అర్థమవుతుంది.

వైసీపీ పెద్దల సిఫారసుతో...

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అందిన ఫిర్యాదుల మేరకు.. విజయవాడ గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్ పోస్టును సీనియారిటీ జాబితాలో లేని వ్యక్తికి నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టారు. ఈఎన్‌సీ కార్యాలయంలో నాలుగు చీఫ్ ఇంజనీర్ (సీఈ) పోస్టులు ఉన్నాయి. ఈఎన్‌సీతో పాటు మరో మూడు సీఈ పోస్టులు ఉన్నాయి. అదనపు సీఈ పోస్టు అవసరం లేదు. కానీ డ్రింకింగ్ వాటర్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఒక డీఈకి చీఫ్ ఇంజనీర్ (సీఈ)గా పదోన్నతి ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వాస్తవానికి చీఫ్ ఇంజనీర్ల (సీఈ) పోస్టులకు రోస్టర్ లేదు. ఈఎన్‌సీతో కలిపి నలుగురు చీఫ్ ఇంజనీర్లు ఉండగా.. దొడ్డిదారిన ఐదో చీఫ్ ఇంజనీర్‌గా వైసీపీ ప్రభుత్వ పెద్దలు సిఫార్సు చేసిన డీఈఈని తెరమీదకు తీసుకువచ్చారు. ఆ వ్యక్తి డీఈ కేడర్ అయినా వైసీపీ పెద్దలతో తనకున్న పలుకుబడితో ఇన్‌చార్జి ఈఈ, ఎస్ఈ, సీఈలుగా పలు సందర్భాలలో పని చేశారు. ఆయన కంటే ఎక్కువ సీనియారిటీ గల వారు చాలామంది ఉన్నా.. వారందరిని పక్కన పెట్టి మరీ పదోన్నతి కల్పించారు. ఆయనను రిజర్వేషన్ల ప్రాతిపదికన నియమించినట్టు వైసీపీ వీరవిధేయ ఉన్నతాధికారులు వాదించారు. రిజర్వేషన్ల ప్రాతిపదికనే ఆయనకు పదోన్నతి కల్పిస్తే, అదే రిజర్వేషన్ల ప్రకారం సీనియారిటీ ఉన్న పలువురు అధికారులకు న్యాయం చేయాలి కదా? వారికెందుకు న్యాయం చేయలేదన్నది ఇక్కడ ప్రశ్న. రిజర్వేషన్ల ప్రాతిపదికనే ఆ డీఈఈకి పదోన్నతి కల్పించారనుకుంటే.. ఆ దామాషా ప్రకారం ఇప్పటికే పదోన్నతులు కల్పించారు. రిజర్వేషన్ల దామాషా పూర్తయితే ఆ పేరుతో అదనపు పదోన్నతులు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు గతంలో జర్నయిల్ సింగ్ అనే వ్యక్తి వేసిన కేసులో నిర్దేశించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఆ వీరభక్త అధికారికి నిబంధనలకు విరుద్ధంగా ఈఎన్‌సీ పదోన్నతి అందుకునేలా సీనియారిటీని కూడా కల్పిస్తూ ఆదేశాలు ఇచ్చారు. డీఈఈకి అతి తక్కువ సమయంలో ఈఈ, ఎస్ఈ, సీఈగా పదోన్నతులు కల్పించారు. ఈఎన్‌సీగా పదోన్నతిగా పొందేందుకు కూడా లైన్ క్లియర్ చేశారు. ఓ అధికారికి ఇలా సీనియారిటీ కల్పించటం ఎక్కడైనా ఉంటుందా? ఎంత రిజర్వేషన్లు చూసుకున్నా ఇలాంటి విధానం ఎక్కడైనా ఉంటుందా? అని బాధిత అధికారులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించిన క్రమంలో ఎస్సీ, ఎస్టీ పదోన్నతులకు సంబంధించి సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిందిగా నిర్దేశించింది. గత వైసీపీ ప్రభుత్వం తెలివిగా ఈ అంశాన్ని తాత్సారం చేయటం కోసం ఐఏఎస్ అధికారులతో కమిటీని నియమించింది. ఆ కమిటీ ఇప్పటి వరకు ఎలాంటి నివేదికా ఇవ్వలేదు.

కోర్టు ఆదేశాలు బేఖాతర్

ఆర్‌డబ్ల్యూఎస్‌లో సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవటంతో బీసీ, ఓసీ ఉద్యోగుల సంఘాలు 2020లో హైకోర్టును ఆశ్రయించాయి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పదోన్నతులు అమలు చేయాలని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. హైకోర్టు ఆదేశాలను కూడా వైసీపీ ప్రభుత్వం ఖాతర్ చేయలేదు. తమకు అన్యాయం జరుగుతుందన్న ఉద్దేశ్యంతో సీనియారిటీ ఉన్న 20 మంది పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు మళ్లీ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలు జారీ చేసిన ప్రతిసారీ అమలు చేస్తున్నట్టుగా ఉత్తర్వులు ఇవ్వటం, ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వటం తప్పితే.. పదోన్నతుల విషయంలో మళ్లీ పాత తంతునే పాటిస్తున్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ జీఓలు, గెజిట్ నోటిఫికేషన్ల ప్రకారం ఆర్అండ్‌బీ వంటి మిగిలిన ఇంజనీరింగ్ విభాగాలలో తమకు అన్వయించుకుని అమలు చేస్తుండగా.. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌లలో మాత్రం అమలు చేయటం లేదు.



తాడేపల్లి సమీప కుంచనపల్లిలో కొనుగోలు చేసిన విల్లా



అనంతపురంలో ఓ భవనం, నిర్మాణంలో ఉన్న మరో భవనం



తెలంగాణలో మొయినాబాద్‌లోని గెస్ట్‌హౌస్

అడ్డగోలుగా చెల్లింపులు

వైసీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా తమకు అనుకూలంగా పనిచేసిన ఏఈఈలకు డీఈ, ఈఈ పోస్టులను కట్టబెట్టారని, అడ్డగోలుగా ఎంబుక్‌లను రికార్డు చేయించి బిల్లులు చెల్లింపులకు పాల్పడారని బాధిత అధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్‌ను పూర్తిగా అవినీతిమయంగా మార్చేశారని, శాఖను భ్రష్టుపట్టించారని తమకు న్యాయం చేయాల్సిందిగా పవన్ కల్యాణ్‌కు అభ్యర్థించారు.

అవినీతిపై విచారణ జరిపించండి

వైసీపీ ప్రభుత్వ హయాంలో వీరభజన చేస్తూ వారి పాపంలో భాగస్వామ్యం పంచుకున్న అవినీతి అధికారులు ఆదాయానికి మించి ఆస్తులను కూడబెట్టుకున్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పలువురు కాంట్రాక్టర్లు ఫిర్యాదులు చేశారు. అవినీతి సొమ్ముతో అక్రమ సౌధాలు నిర్మించుకున్నారని, విల్లాలు, భారీ బహుళ అంతస్తుల భవనాలను కట్టిస్తున్నారని తెలిపారు. వీటిపై సమగ్ర విచారణ జరిపించాల్సిందిగా ఫిర్యాదులో పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ ఆ దిశగా దృష్టి సారిస్తున్నట్టు సమాచారం. ఓ అధికారి భారీగా అవినీతికి పాల్పడ్డారని, పలు ప్రాంతాల్లో బహుళ అంతస్థుల భవనాలు కట్టుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.



పెళ్లి.. చాలా కాస్ట్‌లీ గురూ!

- ఈ ఏడాది అంచనా 10.85 లక్షల కోట్లు
- అమెరికాలో కంటే భారత్‌లో రెట్టింపు వ్యయం

న్యూఢిల్లీ, జూలై 7: ప్రతి మనిషి జీవితంలో ఒకే ఒక్కసారి జరిగే వేడుక పెళ్లి. తల్లిదండ్రులు తమ హోదాకు తగినట్టు ఖర్చుకు వెనుకాడకుండా పిల్లల వివాహాలను వైభవంగా జరిపిస్తారు. పేదలు కూడా అప్పు చేసైనా ఉన్నంతలో చేస్తారు. ధనవంతులైతే కోట్లకు కోట్లు ఖర్చు చేసేస్తారు. మన దేశంలో ఈ మధ్యకాలంలో పెళ్లిళ్ల కోసం చేస్తున్న ఖర్చు బాగా పెరిగిపోతోంది. జెఫరీజ్ గ్రూప్ నివేదిక ప్రకారం... ఈ ఏడాది మన దేశంలో పెళ్లిళ్లకు అయ్యే ఖర్చు దాదాపు రూ.10.85 లక్షల కోట్లు ఉండొచ్చని అంచనా! భారతీయులు ఆహారం, కిరాణ సరుకుల కోసం చేసే వ్యయం తర్వాత పెళ్లిళ్లకు చేసే ఖర్చు రెండో స్థానంలో ఉంది. పిల్లల చదువు కోసం చేసే ఖర్చు కంటే పెళ్లిళ్లకు రెట్టింపు చేస్తున్నారు. భారతీయులు సగటున ఓ పెళ్లికి రూ.12 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఈ నెలలో పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమవుతుంది. అక్టోబరు-డిసెంబరు మధ్య కాలంలో ఎక్కువగా జరుగుతాయి. దాదాపు 90 శాతం వివాహాలు పెద్దలు కుదిర్చినవే.

ప్రత్యేకతలు

ప్రపంచంలోనే అత్యధికంగా భారత్‌లో ఏటా దాదాపు 80 లక్షల నుంచి కోటి వివాహాలు జరుగుతాయి. అమెరికాతో పోలిస్తే భారత్‌లో వివాహాలకు రెట్టింపు ఖర్చు చేస్తారు. చైనాతో పోలిస్తే మాత్రం భారత్‌లోనే ఖర్చు తక్కువ.

కొత్త ట్రెండ్

సాధారణంగా వధువు సొంతూరులోనో లేదా వధూవరుల కుటుంబాలకు అనుకూలమైన చోట వివాహ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇటీవల కాలంలో వివాహ సంప్రదాయంలో కొత్త ట్రెండ్ మొదలైంది. డబ్బున్నవారు గోవా, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, అండమాన్స్ వంటి ప్రాంతాలకు వెళ్లి అంగరంగ వైభవంగా వివాహ వేడుకలు చేసుకుంటున్నారు.

ఉపాధి

పెళ్లిళ్ల వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి లభిస్తుంది. కేటరింగ్, డెకరేషన్, గిఫ్టులు, ఫొటోగ్రాఫర్స్, ఎలక్ట్రానిక్స్, ఆటో మొబైల్స్, పెయింట్స్, ట్రావెల్, ప్లానర్స్ తదితరాలకు భారీగా ఖర్చు చేస్తారు. పెళ్లి బడ్జెట్‌లో ఎక్కువగా బంగారు ఆభరణాలకు ఖర్చు చేస్తారు.

పని ఇప్పిస్తామని పడుపు వృత్తిలోకి..

- యువతుల దుస్థితిపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్
- వెంటనే చర్యలకు రాష్ట్రాలు,యూటీలకు నోటీసు
- బిచ్చగాళ్ల రక్షణ, పునరావాసానికి జాతీయ విధానం
- కేంద్రం, రాష్ట్రాలకు హక్కుల కమిషన్ సిఫారసు

న్యూఢిల్లీ, జూలై 7: పని ఇప్పిస్తామని చెప్పి, యువతులను బలవంతంగా పడుపు వృత్తిలోకి దింపుతున్న వైనంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించింది. దీనిపై తమకు అందుతున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపింది. నిజానిజాలు నిగ్గు తేల్చాలంటూ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కమిషన్ కోరింది. ఈ మేరకు నోటీసులు జారీచేసింది. రాంచీ (బిహార్), ఝార్ఖండ్‌లో ఈ నెల ఒకటో తేదీన హోటళ్లు, లాడ్జీలపై దాడులు చేసి అరెస్టులు చేసినప్పుడు చాలామంది మహిళలు తమను బలవంతంగా పడుపు వృత్తిలోకి లాగారని తెలిపారని వివరించింది. కొన్ని అసాంఘిక శక్తులు తమకు పని ఇప్పిస్తామని నమ్మించి ఈ సాలెగూడులోకి తెచ్చి పడేశాయని చెప్పినట్టు వార్తలు వస్తున్నాయన్నారు. ఆ వార్తలు నిజమే అయితే, వెంటనే చర్యలు చేపట్టాలని ఆ నోటీసులో కమిషన్ కోరింది. కాగా, బిచ్చగాళ్ల రక్షణ, పునరావాసం కోసం జాతీయ విధానం రూపొందించాలని ప్రభుత్వాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ సిఫారసు చేసింది. దేశవ్యాప్తంగా ఎంతమంది ఇటువంటివారు ఉన్నారనే సమాచారంతో జాతీయ స్థాయిలో డేటాబేస్‌ను ఏర్పాటుచేయాలని కూడా తన ప్రతిపాదనల్లో కోరింది. వీటిపై వీలైనంత త్వరగా జాతీయ సమగ్ర విధానం అవసరమని అభిప్రాయపడింది. భిక్షం ఎత్తాల్సిన పని లేని పరిస్థితులను సృష్టించేలా, ఆ వృత్తిలోని వారు మెరుగైన జీవితం గడిపేలా ప్రణాళికలు తయారుచేయాలని కేంద్రం, రాష్ట్రాలను కోరింది. ఇప్పటికే పలు సంస్కరణలు, పథకాలు, కార్యక్రమాలను ప్రభుత్వాలు అమలు చేస్తున్నా, బిచ్చగాళ్ల సమస్య పెరుగుతుండటం పట్ల కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది.



యూరాలజీ సదస్సులో పాల్గొన్న వైద్యులు

మూత్రనాళాలు సన్నబడుతున్నాయ్

- రోడ్డు ప్రమాదాలు, ఇన్‌ఫెక్షన్లు కారణం
- ఇటీవల పెరిగిన ఈ శస్త్రచికిత్సల సంఖ్య
- యూరాలజీ సదస్సులో వైద్యుల వెల్లడి

హైదరాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మూత్రనాళాలు సన్నబడిపోతున్నాయని, దాంతో శస్త్రచికిత్స చేసి సరిచేయాల్సి వస్తోందని, ఈ తరహా ఆపరేషన్లు ఇటీవల కాలంలో బాగా పెరిగాయని వైద్య నిపుణులు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్ల వల్ల మూత్రనాళాలు సన్నబడుతున్నాయని వారు వివరించారు. ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆధ్వర్యంలో యూరాలజీ సదస్సు హైదరాబాద్‌లో ప్రారంభమైంది. 8 దేశాలతో సహా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 800 మందికి పైగా యూరాలజిస్టులు హాజరయ్యారు. మూత్రనాళ పునర్నిర్మాణ శస్త్రచికిత్సల్లో సరికొత్త ప్రక్రియలపై సదస్సులో చర్చించారు. మూత్రనాళాలు సన్నబడే అవకాశాలు పురుషుల్లో ఎక్కువగా ఉంటాయని, ఇటీవల మహిళలు, పిల్లల్లోనూ ఈ సమస్య కనిపిస్తోందని వైద్యులు తెలిపారు. మూత్రనాళాలు సన్నబడి మూత్రవిసర్జన తగ్గడం, దానివల్ల సమస్యలు వచ్చినప్పుడు శస్త్రచికిత్స అవసరమవుతుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు, ఇన్ఫెక్షన్ల వల్ల మూత్రనాళ పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు ఎక్కువగా చేయాల్సి వస్తోందన్నారు. యూరాలజిస్టు డాక్టర్ భవతేజ్ ఎన్ గంటి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఫ్రాక్చర్లు అయినప్పుడు మూత్రనాళాలు కూడా దెబ్బతింటాయని, అలాంటప్పుడు కొన్ని నెలలు వేచి ఉండి, తర్వాత సరిచేయాల్సి ఉంటుందన్నారు. ఎక్కువ కాలం పాటు ఆస్పత్రిలో ఉన్నప్పుడు క్యాథటర్స్ అమర్చడం, ఇతర వ్యాధుల వల్ల కూడా మూత్రనాళాలు సన్నబడుతున్నాయన్నారు. ఏఐఎన్‌యూ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ సి.మల్లికార్జున మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేళ్లలో వెయ్యికి పైగా శస్త్రచికిత్సలు చేశామని తెలిపారు. దేశంలో మూత్రనాళ శస్త్రచికిత్సల్లో అగ్రగణ్యులుగా పేరొందిన డాక్టర్ సంజయ్ కులకర్ణి (పుణె), డాక్టర్ గణేష్ గోపాలకృష్ణన్ (కోయంబత్తూరు), ఐఎస్‌బీ హైదరాబాద్ మాజీ డీన్ అజిత్ రంగ్నేకర్ మాట్లాడారు.

మంత్రి లోకేశ్ ప్రత్యేక చొరవతో దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా

- వాట్సాప్‌లో అందిన సమాచారంపై తక్షణమే స్పందన
- ఇంటర్ మార్కుల మెమోలో సమస్యకు పరిష్కారం
- జీవో విడుదలతో 25 మంది దివ్యాంగ విద్యార్థులకు సీట్లు
- పేరొందిన ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు

మంగళగిరి సిటీ, జూలై 7: వాట్సాప్ ద్వారా అందిన సమాచారంతో తక్షణమే స్పందించిన రాష్ట్ర విద్య, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ 25మంది దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్తును కాపాడారు. మంత్రి లోకేశ్ చొరవతో ఆ విద్యార్థులు దేశ వ్యాపితంగా పేరుగాంచిన ఐఐటీ, ఎన్ఐటీ విద్యా సంస్థల్లో ప్రవేశం పొందగలిగారు. విజయవాడకు చెందిన దివ్యాంగ విద్యార్థి మారుతీ పృథ్వీ సత్యదేవ్ ఈ ఏడాది నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో దివ్యాంగుల కోటాలో 170వ ర్యాంకు సాధించాడు. ఈ ర్యాంకు ప్రకారం సత్యదేవ్‌కు చెన్నయ్ ఐఐటీలో సీటు రావలసి వుంది. అయితే దివ్యాంగ విద్యార్థులకు ఇచ్చే మార్కుల మెమో విషయంలో రాష్ట్ర ఇంటర్ అధికారులు ఎప్పటినుంచో చేస్తున్న ఓ పొరపాటు దివ్యాంగ విద్యార్థులను ఇబ్బందుల్లోకి నెట్టింది. సత్యదేవ్‌కు తాను సాధించిన ర్యాంకు ప్రకారం జోసా కౌన్సెలింగ్ రౌండ్-1లో ఐఐటీ మద్రాసులో సీటు కేటాయించారు. డాక్యుమెంట్ వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా ఇంటర్మీడియట్ మెమో సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేయాలని కోరారు. ఏపీ ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం దివ్యాంగులకు లాంగ్వేజ్ సబ్జెక్టుల్లో రెండింటిలో ఒకదానికి మినహాయింపు వుంటుంది. దీని ప్రకారం సత్యదేవ్ సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష రాయలేదు. ఇంటర్ పరీక్షల్లో ఏ-గ్రేడ్ ఉత్తీర్ణత సాధించాడు. మినహాయింపు పొందిన లాంగ్వేజ్ సబ్జెక్టుతో కలిపి మార్కుల మెమోలో 5 సబ్జెక్టుల మార్కులు వుంటాయి. మినహాయింపు పొందిన సబ్జెక్టుకు సంబంధించి సర్టిఫికెట్‌లో ఇంటర్‌బోర్డు వారు ఎప్పటినుంచో 'ఈ' (ఎగ్జమ్షన్) అని మాత్రమే పేర్కొంటున్నారు.

కానీ, ఐఐటీ మద్రాస్ డాక్యుమెంట్ వెరిఫికేషన్ విభాగం వారు సత్యదేవ్ మెమోలో కేవలం నాలుగు సబ్జెక్టులు మాత్రమే వున్నాయని, గణితం-ఏ, బీలను ఒకే సబ్జెక్టుగా పరిగణిస్తున్నామని పేర్కొంటూ ఇంటర్మీడియట్ మెమోను తిరస్కరిస్తున్నామని సమాధానమిచ్చారు. దీనిపై సత్యదేవ్ ఐఐటీ మద్రాసు వారిని సంప్రదించగా, సెకెంట్ లాంగ్వేజ్ సబ్జెక్టుకు సంబంధించి సర్టిఫికెట్‌లో 'ఈ' స్థానంలో నిర్దిష్ట సంఖ్యా విలువను కలిగివుంటేనే కళాశాలలో ప్రవేశానికి అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఇంటర్ బోర్డు సర్టిఫికెట్ అప్‌లోడ్ విషయంలో ఎదురైన సమస్యను సత్యదేవ్ గత నెల 22వ తేదీన వాట్సాప్ ద్వారా మంత్రి నారా లోకేశ్‌కు తెలియజేశారు. వెంటనే స్పందించిన మంత్రి లోకేశ్ సత్యదేవ్, అతని తండ్రి జయరామ్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దివ్యాంగ విద్యార్థులకు ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్ బోర్డు అధికారులు వెంటనే స్పందించి మార్కుల మెమోలో 'ఈ' స్థానంలో కనిష్ఠంగా 35 మార్కులుగా పేర్కొంటూ మార్కుల మెమో జారీచేశారు. దీనికి సంబంధించి ఆగమేఘాలపై జీవోను కూడా విడుదల చేశారు. దీంతో పృథ్వీ సత్యదేవ్‌కు ఐఐటీ మద్రాసులో సీటు లభించింది. ఈ జీవోతో రాష్ట్రంలోని మొత్తం 25మంది దివ్యాంగ విద్యార్థులకు జాతీయస్థాయిలో పేరొందిన ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ విద్యాసంస్థల్లో సీట్లు లభించాయి. తమ భవిష్యత్తును కాపాడిన మంత్రి లోకేశ్‌కు సత్యదేవ్‌తోపాటు దివ్యాంగ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేశ్ దివ్యాంగ విద్యార్థులను కలిసి అభినందించనున్నారు.

సీట్లు పొందిన విద్యార్థులు వీరే..

మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో జీవో విడుదల కావడంతో రాష్ట్రంలోని మొత్తం 25 మంది దివ్యాంగ విద్యార్థులకు జాతీయ స్థాయిలో పేరొందిన ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ విద్యాసంస్థల్లో సీట్లు సాధించారు. విజయవాడకు చెందిన పృథ్వీ సత్యదేవ్ ఐఐటీ మద్రాస్, నెల్లూరుకు చెందిన ఎస్.స్నేహిత ఐఐటీ కాన్పూర్, తిరుపతికి చెందిన ఎ.తేజిత చౌదరి ఐఐఐటీ, గౌహతి, నెల్లూరుకు చెందిన పీ.నిష్మిత ఎన్ఐటీ నాగపూర్, విజయవాడకు చెందిన సి.రఘునాథ్‌రెడ్డి ఐఐటీ కాలికట్, రాజమహేంద్రవరానికి చెందిన ఎం.మోహన్ నాగమణికంఠ ఎన్ఐటీ జలంధర్, పామర్రుకు చెందిన బి.విజయరాజు ఐఐటీ తిరుపతి, కర్నూలుకు చెందిన కే.ప్రశాంత్ ఎన్ఐటీ సిల్చార్, విజయవాడకు చెందిన జీ.కృష్ణసాయి సంతోష్ ఎన్ఐటీ సూరత్కల్, రాజమహేంద్రవరానికి చెందిన జీ.వంశీకృష్ణ ఎన్ఐటీ వరంగల్, కర్నూలుకు చెందిన వి.వేదచరణ్‌రెడ్డి ఐఐటీ మద్రాసు, నెల్లూరుకు చెందిన నాయుడు రక్షిత్ ఎన్ఐటీ నాగాలాండ్, పెనమలూరుకు చెందిన ఈ.మహీధర్‌రెడ్డి ఐఐటీ ఇండోర్, అనంతపురంకు చెందిన డి.మోక్షశ్రీ ఎన్ఐటీ నాగాలాండ్, రాజమహేంద్రవరంకు చెందిన పీ.దినేష్ ఎన్ఐటీ కురుక్షేత్ర, బి.కోటకు చెందిన జే.మనోజ్‌కుమార్ ఐఐటీ గోవా, నందిగామకు చెందిన సీహెచ్ శివరామ్ ఐఐటీ అగర్తల, విజయవాడకు చెందిన బి.అభిజిత్ ఎన్ఐటీ అరుణాచల్‌ప్రదేశ్, కాకినాడకు చెందిన జీ.రాణి ఐఐటీ ఖరగ్‌పూర్, గుంటూరుకు చెందిన కే.గోకుల్‌సాయి ఎన్ఐటీ తాడేపల్లి గూడెం, విజయవాడకు చెందిన ఎం.అభిలాష్ ఐఐటీ తిరుపతి, గుంటూరుకు చెందిన ఎం.అర్జున్‌కుమార్ సెకెండ్ రౌండ్‌కు దరఖాస్తు, తాళ్లవలసకు చెందిన ఆర్ఎస్ భరద్వాజ ఎన్ఐటీ సిల్చార్, ఎనికేపాడుకు చెందిన జీ.రేష్మిత ఐఐటీ తిరుపతిలో సీట్లు పొందగలిగారు.

మెసేజ్ చేసిన అరగంటలోనే స్పందించారు



ఐఐటీ, మద్రాసు అధికారులు సీటు తిరస్కరించాక ఏం చేయాలో పాలుపోలేదు. మంత్రి నారా లోకేశ్‌కు వాట్సాప్ మెసేజ్ చేశాను. అరగంటలోనే ఆయన స్పందించారు. మా సమస్య పరిష్కారమయ్యే వరకు పేషీ అధికారులను నిరంతరం ఫాలోఅప్ చేస్తూనే వున్నారు. సీటుపై ఆశలు వదులుకున్న సమయంలో మంత్రి లోకేశ్ భగవంతుడిలా వచ్చి అండగా నిలిచారు.

- ఎం.పృథ్వీ సత్యదేవ్, విజయవాడ

భవిష్యత్తుకు భరోసా ఏర్పడింది



కౌన్సెలింగ్ అధికారులు మా మెమోలు తిరస్కరించిన తరువాత భవిష్యత్తు ముగిసిపోయిందని భావించాం. మంత్రి లోకేశ్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లినప్పుడు నేనున్నాననే భరోసా కల్పించి అండగా నిలిచారు. నిరంతరం అధికారులతో మాట్లాడి జీవో విడుదల చేయించడం ద్వారా మళ్లీ మా భవిష్యత్తుపై ఆశలు చిగురించేలా చేశారు. నాకు ఎన్ఐటీ, కాలికట్‌లో సీటు వచ్చింది.

- రఘునాథ్‌రెడ్డి, కడప

రాజకీయ నేతలపై గౌరవం పెరిగింది



తమ సమస్యను తన సమస్యగా భావించి మంత్రి లోకేశ్ తీసుకున్న చొరవను చూశాక రాజకీయ నాయకులపై గౌరవం పెరిగింది. తల్లిదండ్రులు నాకు జన్మనిస్తే లోకేశ్ నా జీవితంలో వెలుగులు నింపారు. జీవో ఇచ్చారని తెలియగానే ఉన్నత చదువులకు ఇక ఢోకా లేదనే నమ్మకం కలిగింది. కౌన్సెలింగ్ 3వ రౌండ్‌లోనే ఎంపికయ్యాను. బీటెక్ తరువాత ఎంటెక్ పూర్తిచేసి పేరున్న సంస్థలో ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం.

- ఎన్.వెంకట స్నేహిత, నెల్లూరు

లోకేశ్ స్ఫూర్తితో ఉన్నతంగా ఎదుగుతా



మార్కుల జాబితాలో లోపాలపై అధికారులు అభ్యంతరం చెప్పాక మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురయ్యాం. సీటు క్యాన్సిల్ అవుతుందేమోనని డీలా పడ్డాం. మంత్రి లోకేశ్ చొరవ చూపి సమస్యను పరిష్కరించడంతో మాకు ధైర్యం వచ్చింది. సీటు వచ్చిందని తెలిశాక మా కుటుంబం మొత్తం ఆనందంలో మునిగిపోయారు. మంత్రి లోకేశ్‌ను స్ఫూర్తిగా తీసుకుని మంచి ఉద్యోగం సాధించి ప్రజలకు సేవ చేస్తాను.

- భరద్వాజనాయుడు, తాళ్లవలస

బీసీ సంక్షేమ సంఘం బలోపేతానికి చర్యలు

- రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



సమావేశంలో పాల్గొన్న కేసన శంకరరావు, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

మంగళగిరి, జూలై 7: రాజకీయ పార్టీలకు దీటుగా బీసీ సంక్షేమ సంఘాన్ని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం కేంద్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్రస్థాయి ముఖ్యనేతలు, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గంలో ప్రతి జిల్లా నుంచి ముగ్గుర్ని కోఆప్ట్ చేసుకుంటున్నట్టు చెప్పారు. జిల్లా కార్యవర్గాల్లో మార్పులు, చేర్పులు చేస్తున్నామని, నిర్మాణాత్మకంగా సంఘాన్ని పటిష్ట పరుస్తామని తెలిపారు. అనుబంధ కుల సంఘాలు, విద్యార్థి, యువజన, మహిళా, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతు అనుబంధ విభాగాలను రాష్ట్ర, జిల్లాస్థాయిలో బలో పేతం చేస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, మంత్రులను సంఘం తరపున ఘనంగా సన్మానించాలని సమావేశంలో నిర్ణయించినట్టు చెప్పారు. బీసీ ప్రజాప్రతినిధులను ఆ యా జిల్లాల్లో స్థానిక కమిటీ నాయకులు సన్మానించాలని కోరారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మహాత్మా జ్యోతిరావు పూలే బీసీభవన్‌ల నిర్మాణం కోసం అన్ని జిల్లాల కలెక్టర్ల కు వినతిపత్రాలు అందజేయాలని, విజయవాడ-గుంటూరు మధ్య ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయిపూలే స్మృతివనం ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశంలో తీర్మానించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమన్వయకర్త బ్రహ్మానంద శర్మ, యువజన విభాగం అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, అధికారప్రతినిధి బాదుగున్నల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సులు పూర్తిచేసిన వారికి నేడు అప్రెంటీస్ మేళా

గుంటూరు(విద్య), జూలై 7: వృత్తి విద్యాకోర్సులు పూర్తిచేసుకున్నవారికి (బాపట్ల జిల్లా) నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం అప్రెంటీస్‌మేళా నిర్వహిస్తున్నట్లు వృత్తివిద్యా కళాశాల ప్రిన్సిపాల్ (గుంటూరు) ఎన్ ఆనందబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అప్రెంటీస్ మేళాలో లలితా సూపర్‌స్పెషాల్టీ హాస్పటల్, అహల్యా నర్సింగ్ హోమ్ సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యు, ఎంఎల్‌టీ పూర్తిచేసుకున్న వారు అప్రెంటీస్ మేళాకు హాజరుకావాలని సూచించారు. అప్రెంటీస్‌మేళాలో ఎంపీహెచ్‌డబ్ల్యులో 36, ఎంఎల్‌టీలో 24 ఖాళీలు భర్తీచేస్తారని తెలిపారు. ఎంపికైనవారికి నెలకు రూ.7వేల స్టయిఫండ్ ఇస్తారని తెలిపారు. మేళాకు వచ్చే విద్యార్థులు బయోడేటా, పది, ఇంటర్ విద్యార్హత సర్టిఫికెట్స్, ఆధార్ మూడు సెట్లు, ఆరు ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు.

తాడేపల్లిలో గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు

- గంజాయి, కారును సీజ్ చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కళ్యాణ్‌రాజు

తాడేపల్లి టౌన్, జూలై 7: ఒరిస్సా సరిహద్దు ప్రాంతం సీలేరు నుండి గంజాయి తెచ్చి విక్రయిస్తున్న ముఠాలోని ఇరువురు సభ్యులను ఆదివారం అరెస్టు చేసి వారి నుండి 2 కిలోల గంజాయిని, కారును స్వాధీనం చేసుకున్నారు. తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో నిందితులను హాజరుపరిచి సీఐ కళ్యాణ్‌రాజు మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు తాను, ఎస్ఐ ప్రతాప్‌కుమార్, సిబ్బందితో తాడేపల్లి రైల్వేగేటు సమీప ప్రాంతానికి వెళ్లగా అక్కడ ఖాళీ ప్రదేశంలో ఏపీ29ఎయు2102 నెంబరు గల కారు పక్కన నిలబడి వున్న ఐదుగురు యువకులు పారిపోతుండగా వారిలో షేక్ సుభాని అలియాస్ పండు, షేక్ ఖాసిం అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా పారిపోయిన అప్పు, రెహమాన్, సాయి కొంతకాలం నుండి వ్యసనాలకు అలవాటు పడి సులువు మార్గంలో డబ్బు సంపాదిద్దామని ఒరిస్సా బోర్డర్ సీలేరు నుండి గంజాయి అమ్మేవారి వద్ద గంజాయి తెచ్చి తాడేపల్లి, మంగళగిరి పరిసర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు అమ్మి తద్వారా వచ్చే డబ్బుతో జల్సాలు చేస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం ఐదుగురు సీలేరుకు కారులో వెళ్లి, అక్కడ ప్రసాద్ అనే వ్యక్తి నుండి కేజీ గంజాయి మూడు వేల చొప్పున నాలుగు కేజీల గంజాయి కొనుగోలు చేసి చిన్నచిన్న పొట్లాలు కట్టి విజయవాడ, కృష్ణాకెనాల్ రైల్వేస్టేషన్, మంగళగిరి ప్రాంతాల్లో అమ్మి వాటితో జల్సాలు చేసినట్టు తెలిపారు. మిగిలిన రెండు కేజీల గంజాయిని ఆదివారం మరలా సదరు యువకులు గంజాయి తాగే అలవాటు ఉన్న వారికోసం అమ్మేందుకు వేచి ఉన్నారు. ఈ క్రమంలో షేక్ సుభాని(ప్రకాష్‌నగర్), షేక్ ఖాసిం(నులకపేట)ను అదుపులోకి తీసుకుని వారి వద్ద రెండు కేజీల గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ కేసులో పరారీలో ఉన్న ముగ్గురు యువకులను త్వరలో అరెస్టు చేస్తామని, పట్టుకున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఎస్ఐ ప్రతాప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడిన అక్షరయోధుడు రామోజీరావు

- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



ప్రసంగిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, వేదిక పైన ఎమ్మెల్యే మాధవి, ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు(కార్పొరేషన్), జూలై 7: ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య వైఫల్యాలపై నిరంతరం యుద్ధం చేసి ప్రజావిజయానికి కృషిచేసిన అక్షరయోధుడు రామోజీరావు అని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఆదివారం గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞానమందిరంలో జన చైతన్య వేదిక, రాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రామోజీరావు సంస్మరణ సభ జరిగింది. సభకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ నేటి యువత రామోజీరావు నిబద్ధత, దృఢ సంకల్పం, క్రమశిక్షణలను అలవర్చుకోవాలని కోరారు. సమాజ రుగ్మతులపై నిరంతరం పోరాడిన సామాజిక విప్లవకారుడు రామోజీరావు అని అన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ ప్రసంగిస్తూ రామోజీ ఈనాడు, ఈటీవీల ద్వారా తెలుగుభాష ఉద్యమానికి ఎనలేని కృషి చేశారన్నారు. ఇంకా కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ ఎస్.తులసిరెడ్డి, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఈనాడు సంపాదకులు ఎం.నాగేశ్వరరావు, రాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ కార్యదర్శి పి.రామచంద్రరాజు, ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ పి.కృష్ణయ్య, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యులు వై.వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, హైకోర్టు న్యాయవాది పి.రవితేజ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో రామోజీరావు జీవిత విశేషాలను ప్రతిబింబించే ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. తొలుత రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నిమిషం పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. రంగం రాజేష్ బృందం రామోజీరావు ప్రాముఖ్యతను వివరించే గేయాలను ఆలపించారు.

కేజేఎస్ఎస్ సేవలు అభినందనీయం

- జీడీసీసీబీ మాజీ అధ్యక్షుడు నల్లపాటి చంద్రశేఖరరావు
- నూతన భవన సముదాయానికి రూ 25 లక్షల విరాళం



నల్లపాటి చంద్రశేఖరరావును సత్కరిస్తున్న పాలకవర్గ సభ్యులు

గుంటూరు (తూర్పు), జూలై 7: పేద, ప్రతిభకలిగిన విద్యార్థినులకు అండగా నిలబడుతున్న కమ్మజన సేవా సమితి సేవలు అభినందనీయమని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ అధ్యక్షుడు నల్లపాటి శివరామ చంద్రశేఖరరావు(చంద్రం) అన్నారు. గుంటూరు జేకేసీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయానికి రూ 25లక్షల విరాళాన్ని ఆయన కుటుంబసభ్యులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆదివారం నరసరావుపేటలోని ఆయన నివాసంలో చెక్కును సమితి గౌరవ అధ్యక్షుడు వంకాయలపాటి బలరామకృష్ణయ్య, కార్యదర్శి చుక్కపల్లి రమేష్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా నల్లపాటి చంద్రం మాట్లాడుతూ ఆమెరికాలో నివాసముంటున్న తమ కుమారుడు నల్లపాటి వంశీమోహన్ ఈ నిధులను సమకూర్చారని వివరించారు. సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ దాతలు వారి ఇంటికి పిలిపించుకుని విరాళం అందజేయడం అభినందనీయమన్నారు. రెండు సంవత్సరాల్లో నిర్మాణాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామన్నారు. అనంతరం నల్లపాటి చంద్రంను పాలకవర్గసభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది నల్లపాటి లక్ష్మీనారాయణ, పాలకవర్గ సభ్యులు మర్రిపూడి సీతారామయ్య, కన్నెగంటి బుచ్చయ్యచౌదరి, షైనేని సీతారామయ్య, వడ్లమూడి శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

కొత్తగణేశునిపాడులో భారీ చోరీ

- 50 సవర్ల బంగారం, 2.50 లక్షల నగదు, కేజీ వెండి అపహరణ



బాధితులతో మాట్లాడుతున్న సీఐ బాలకృష్ణ, ఎస్ఐ అమీనుద్దీన్

మాచవరం, జూలై 7: మండలంలోని కొత్తగణేశునిపాడు గ్రామంలో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన జోగిపర్తి ఆంజనేయులు గృహంలో 50 సవర్ల బంగారం, 2.50 లక్షల నగదు, కేజి వెండి అపహరణకు గురైంది. జోగిపర్తి ఆంజనేయులు తన భార్య ప్రసవం నిమిత్తం ఈ నెల 1వ తేదీన నరసరావుపేట వైద్యశాలకు వెళ్లారు. మధ్యలో ఒకటి, రెండుసార్లు ఆంజనేయులు ఇంటికి వచ్చి వెళ్లాడు. అయితే ఆదివారం ఉదయం బయటి గేటుకు వున్న తాళాలు పగులగొట్టి వుండటంతో గమనించిన ఇరుగుపొరుగు వారు గ్రామంలో వున్న ఆంజనేయులు బంధువులకు విషయాన్ని తెలియజేశారు. వెంటనే వారు వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి విషయాన్ని ఆంజనేయులుకు, మాచవరం పోలీసులకు సమాచారాన్ని చేరవేశారు. విషయం తెలుసుకున్న దాచేపల్లి ఇన్‌చార్జ్ సిఐ బాలకృష్ణ, మాచవరం ఎస్ఐ అమీనుద్దీన్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. జరిగిన సంఘటనపై గృహయజమాని ఆంజనేయులును వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీరువాలో వున్న 50 సవర్ల బంగారం, 2.50 లక్షల నగదు, కేజి వెండి అపహరణకు గురైనట్లు పోలీసులకు తెలిపాడు. గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాను కూడా పగులగొట్టి ఇంట్లో వున్న వస్తువులను చిందర వందర చేసి దోపిడీకి పాల్పడినట్లు పోలీసులకు వివరించాడు. బాధితుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు మాచవరం ఎస్ఐ అమీనుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందుకున్న గుంటూరు క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకొని వేలిముద్రలు సేకరించారు.

జంగమహేశ్వరపాడులో నాటుబాంబు కలకలం

- భయాందోళనలో గ్రామస్తులు





జంగమహేశ్వరపాడులో పోలీసులు, ఇన్‌సెట్లో నాటుబాంబు పేలిన ప్రదేశం

దుర్గి, జూలై 7: మండలంలోని జంగమహేశ్వరపాడులో ఆదివారం నాటుబాంబు పేలడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గురజాల డీఎస్పీ శ్రీనివాసరావు, కారంపూడి సర్కిల్ సీఐ ఆలహరి శ్రీనివాసరావు, ఎస్ఐ కోటయ్య సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగమహేశ్వరపాడు గ్రామ శివారులో వంగాల రాఘవరెడ్డి పొలాన్ని గత కొంతకాలంగా కాకిరాల గ్రామానికి చెందిన బొజ్జా నాగేశ్వరరావు కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. ఆదివారం పొలంలో దుక్కి దున్నేందుకు నాగేశ్వరరావు తనతోపాటు తన కుమారుడు నాగేంద్రబాబుతో పొలం చేరుకున్నారు. అనుమానాస్పదంగా కనిపించిన నాటుబాంబును నాగేంద్రబాబు విసిరివేశాడు. ఒక్కసారిగా పేలింది. గ్రామ సమీపంలో పొలం ఉండడంతో ఆ శబ్దానికి ఉలిక్కిపడిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బాంబు స్క్వాడ్‌ను రప్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గత కొంతకాలంగా ఫ్యాక్షన్ గ్రామంగా పేరొందిన జంగమహేశ్వరపాడు శివారులో బాంబు పేలడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఎంపీ కృష్ణప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న డివిజన్ కమాండర్ గేరా థామస్

సాల్వేషన్ ఆర్మీ చర్చి ప్రార్థనలో పాల్గొన్న ఎంపీ తెన్నేటి

బాపట్ల, జూలై 7 : పట్టణంలోని సాల్వేషన్ ఆర్మీ సెంట్రల్ కోర్ చర్చిలో ఆదివారం ప్రార్థనలో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. పరిశుధ ఆరాధనలో పాల్గొని ప్రార్థన చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో తనను ఎంపీగా గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీగా గెలిచి తొలిసారిగా చర్చికి వచ్చినందుకు డివిజన్ కమాండర్ గేరా థామస్ సంఘస్తులతో కలిసి ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఎంపీ మాట్లాడుతూ తన విజయం కోసం ప్రార్థించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. బిడ్డల భవిష్యత్తు కోసం, వారిని సన్మార్గంలో నడిపించటానికి అందరూ తమవంతు కృషి చేయాలని సంఘస్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘకాపరి కెప్టెన్ వి.శేఖర్, కెప్టెన్ వి.రజనీ, సంఘపెద్దలు పి.రాజకుమార్, మేకతోటి శరత్ ప్రవీణ్, బుర్రా చంటి, పీసీసీ సభ్యులు కాగిత సుందరదాసు, గేరా బెనర్జి మీనన్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మరాజు కృష్ణమూర్తి సేవలు అభినందనీయం

కర్లపాలెం, జూలై 7 : మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు తిమ్మరాజు కృష్ణమూర్తి సేవలు అభినందనీయమని పేరలి నరసయ్య చారిటబుల్‌ట్రస్ట్ అధినేత, ప్రముఖ నేత్ర వైద నిపుణులు పేరలి బాలకృష్ణమూర్తి అన్నారు. కర్లపాలెంలోని శ్రీరామకృష్ణ సేవాసమితిలో ఆదివారం తిమ్మరాజు కృష్ణమూర్తి సంస్మరణ సభను నిర్వహించారు. బాలకృష్ణమూర్తి మాట్లాడుతూ కృష్ణమూర్తి గణపవరం గ్రామానికి చిన్న వయస్సులోనే గ్రామసర్పంచ్‌గా పనిచేసి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడిగా పనిచేసి మండల ప్రజలకు, రైతాంగానికి విశేష సేవలందించారని కొనియాడారు. తిమ్మరాజు కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో తిమ్మరాజు వెంకటసుబ్బారావు, కాటూరి వెంకటేశ్వరరావు, ఆరె వెంకటేశ్వర్లు, గిడుగు వెంకటేశ్వర్లు, పెనుమెత్స బాపిరాజు, ఎండి మొహిద్దీన్‌బేగ్, లలితబాబు, టివి సుబ్బారావు, ఎన్.నాగమల్లేశ్వరరావు, తడికమళ్ళ విజయ్‌కుమార్‌పాల్గొన్నారు.



కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నేతలు

స్కందషష్ఠి, సర్పసూక్త హోమార్చన జయప్రదం చేయాలి

● శ్రీ లలిత త్రిపురసుందరి పీఠం అధ్యక్షుడు నెమలికంటి

బాపట్ల, జూలై 7 : పట్టణంలోని చీలురోడ్డుసెంటర్‌లో ఉన్న శ్రీపాండురంగ స్వామి దేవాలయంలో శ్రీలలిత త్రిపురసుందరి పీఠం ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ సాయంత్రం 4 గంటలకు సుబ్రహ్మణ్యస్వామికి కళ్యాణప్రదస్కందషష్ఠి, సర్పసూక్తహోమార్చన జరుగుతుందని శ్రీలలిత త్రిపురసుందరి పీఠం అధ్యక్షుడు నెమలి కంటి హనుమంతరావు తెలిపారు. ఈ విషయమై పండితులతో కలిసి ఆదివారం ఆయన మాట్లాడుతూ పూజ అనంతరం సుబ్రహ్మణ్య మూలమంత్రం, నవగ్రహ, లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యమూలమంత్రాలతో సర్పసూక్తహోమార్చన జరుగుతుందన్నారు. ఈహోమపూజ వల్ల వివాహం, సంతానం, దాంపత్యం, ఆరోగ్యం, రుణవిమోచన, ఆర్థికవృద్ధి వంటి మేలు జరుగుతాయన్నారు. ఈనెల 9వ తేది లోపు భక్తులు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు. సమావేశంలో పండితులు మేడూరి వెంకటఅప్పలాచార్యులు, రొంపిచర్ల కేశవాచార్యులు, పంగులూరి కౌండిన్య, పరాశరం రఘురాం పాల్గొన్నారు.

కర్లపాలెంలో బీపీ, షుగర్ వైద్యశిబిరం

కర్లపాలెం,జూలై 7 : కర్లపాలెం శ్రీ రామకృష్ణ సేవాసమితిలో పేరి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత బీపీ, షుగర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు చల్లా రామ్మోహన్‌రావు పాల్గొని సుమారు 110 మందికి బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. నెలకు సరిపడ మందులను అందజేశారు. బీపీ, షుగర్ అదుపులో ఉంచుకొనేందుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తిమ్మరాజు వెంకటసుబ్బారావు, ఉపాధ్యక్షులు ఎ.వెంకటేశ్వర్లు, పెనుమెత్స బాపిరాజు, నేత్ర వైద్యనిపుణులు పేరలి బాలకృష్ణమూర్తి, టి.విజయకుమార్, నందిపాటి నాగమల్లేశ్వరరావు, తూనుగుంట్ల లలితబాబు, వెంకటసుబ్బారావు, జిడుగు వెంకటేశ్వర్లు, బాలకోటేశ్వరరావు పాల్గొన్నారు.

బాపట్ల స్టేషన్‌లో రైళ్ళు నిలుపుదల కోరుతూ వినతి



ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ యువ మోర్చా నాయకులు

బాపట్ల, జూలై 7 : బాపట్ల రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ళు ఆపాలని కోరుతూ బీజేపీ యువమోర్చా నాయకులు ఆదివారం ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తప్పనిసరిగా రైళ్ళు ఆపే విధంగా చూడాలని విజయవాడ డీఆర్ఎం, సికింద్రాబాద్ ఆర్ఎంకి ఫోన్‌లో మాట్లాడి కోరినట్లు ఎంపీ తెలిపారు. తప్పనిసరిగా రైళ్ళ నిలుపుదలకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా అధ్యక్షుడు నాళం నరేష్, బీజేపీ పట్టణాధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్, బూర్లె రత్తయ్య, నరాలశెట్టి శ్రీనివాస్, మువ్వల శ్రీనివాస్, బి.బాబు నాగేంద్ర, బ్రహ్మాండం బాలనారాయణ, కొత్రా రామకృష్ణ, నటరాజన్ ఉన్నారు.

● బాపట్ల పౌరసమాఖ్య అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.విజయ్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ బి.శరత్‌బోస్ సభ్యులతో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌ను ఆదివారం కలిశారు. సికింద్రాబాద్-తిరుపతి మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-చెన్నై మధ్య నడిచే జీటి ఎక్స్‌ప్రెస్, బెంగుళూరు-అగర్తల మధ్య నడిచే హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-తిరుపతి మధ్య నడిచే పద్మావతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి-విశాఖపట్టణం మధ్య నడిచే డబల్‌డెకర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ళు బాపట్లలో నిలుపుదలకు చొరవ తీసుకోవాలని వారు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌ను కోరుతూ వినతిపత్రం అందజేశారు.

బియ్యం పంపిణీ

పిట్టలవానిపాలెం, జూలై 7 : మండలంలోని సంగుపాలెం కోడూరులో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి కార్యనిర్వాహక బాపట్ల జిల్లా అధ్యక్షుడు తోలేటి నీలాంబరం ఆధ్వర్యంలో నిరుపేదలకు బియ్యం పంపిణీ చేశారు. గ్రామ సభ్యులు తోలేటి కిషోర్, జోసఫ్ రమేష్, రాంబాబు, అబ్రహం, ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అందని విరామ భృతి

● కూటమి ప్రభుత్వం అందించాలని వేడుకోలు

రేపల్లె, జూలై 7 : సముద్ర చేపల వేట ప్రారంభించి 20 రోజులు కావస్తున్నా నేటికి విరామం భృతి అందలేదంటూ మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. నూతన ఎన్డీయే కూటమి ప్రభుత్వం మత్స్యకారుల వేట విరామ సమయంలో రూ.20 వేల భృతి అందిస్తామంటూ ఎన్నికల ముందు హామీ చేశారని, మత్స్యకారులపై దృష్టిసారించి భృతిని అందించే విధంగా చర్యలు చేపట్టాలని తీరప్రాంత మత్స్యకారులు కోరుతున్నారు. హార్బర్‌లో నివశిస్తున్న ప్రజలకు తాగునీరు కూడా అందని పరిస్థితి నెలకొందంటూ అక్కడి ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో వేట నిషేధం. ఆ సమయంలో మత్స్యకారులకు వేట విరామ భృతి అందించాల్సి ఉంది. గత ప్రభుత్వం మత్స్యకారులకు వేట భృతి అందించలేదు. నూతన ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న మత్స్యకారులు వేట ప్రారంభించటం జరిగిందని, మత్స్యకార కుటుంబాల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి వేట విరామ భృతిని అందించాలని కోరుతున్నారు. హార్బర్‌లో 1000 బోట్లు, ఫైబర్ బోట్లు, ఇంజన్ నావలు, సాంప్రదాయ పడవలు ఉన్నాయి. కొత్తపాలెం, నక్షత్రనగర్, రేపల్లె మండలం లంకేవానిదిబ్బ, పెనుమూడి, మోళ్ళగుంట, లక్ష్మీపురం గ్రామాల్లో 8 వేల మంది వేట చేసుకుని జీవనాన్ని గడుపుతున్నారు. ఒక్కొక్క బోటుకు 8 నుంచి 10 మంది వరకు కళాసీలు పని చేస్తుంటారు. అన్ని బోట్లలో సుమారు 8 వేల మంది వేట చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. 40 రోజులుగా వేట చేయకపోవటంతో కుటుంబాలు పోషించుకోలేని పరిస్థితి నెలకొంది. ఏ రోజు కూలీ తెచ్చుకుని ఆ రోజు కుటుంబాన్ని పోషించుకునే పరిస్థితి నెలకొంది. మత్స్యకారులు పనిదినాలను కోల్పోయి ఆకలితో అలమటిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారంటూ భోరున విలపిస్తున్నారు. విరామ భృతి నేటికి ఇవ్వలేదని కొందరు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గంలో వేటపై 10 వేల మంది జీవిస్తుండగా, 8000 మందికి వేట నిషేధ భృతిని అందిస్తున్నారు. వారిలో ఇంకా 1200 మందికి గత సంవత్సరం ఇవ్వాల్సిన భృతి నేటికి ఇవ్వలేదు. ఆ ప్రక్రియ నేటికీ పూర్తయిన దాఖలాలు లేవు. ఈ సంవత్సరమైనా సకాలంలో వేట విరామ భృతిని అందించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు భృతి కల్పించిన దాఖలాలు లేవు. నూతన ప్రభుత్వం అయినా దృష్టిసారించి వేట విరామ భృతిని అందించాలని కోరుతున్నారు.



హార్బర్‌లో జెట్టీవద్ద నిలిచిన బోట్లు

రోటరీ సేవలు అభినందనీయం : వేగేశన

బాపట్ల,జూలై 7 : రోటరీక్లబ్ ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్ల రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం రాత్రి విజయలక్ష్మీపురంలోని రోటరీ కల్యాణ మండపంలో జరిగింది. కార్యక్రమానికి రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రావూరి వీరరాఘవయ్య అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రోటరీక్లబ్ సభ్యులంతా ఐక్యంగా ఉండి సేవలో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పేద కుటుంబాల వారికి నిత్యావసర వస్తువులు, ఎయిమ్ ఫర్ సేవా విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. నూతన అధ్యక్షుడిగా కోళ్ళపూడి ఉపేంద్రగుప్తా, కార్యదర్శిగా వేజండ్ల శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా కె.ఆంజనేయ వరప్రసాద్, కోశాధికారిగా వి.వేణుగోపాల్, కొత్త సుబ్బారావులతో ప్రమాణ స్వీకారం చేయించారు. విజయవాడ టికె ఇండస్ట్రీస్ సంకటి బ్రహ్మారెడ్డి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, కొల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బగళాముఖి అమ్మవారి కొలుపుల మహోత్సవం

పిట్టలవానిపాలెం, జూలై 7 : చందోలు గ్రామపంచాయతీలోని ఎస్టీ కాలనీలో ఉన్న శ్రీ బగళాముఖిఅమ్మవారి కొలుపుల మహోత్సవం సందర్భంగా ఆదివారం కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామ సర్పంచ్ మాడా సుబ్రహ్మణ్యం విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు చల్లా రామయ్య, పెదగొల్లపాలెం గ్రామసర్పంచ్ యల్లావుల నాని, చందోలు గ్రామ యువనాయకులు ఎస్కే మౌలాలి, జహీర్‌బాషా, వేటగిరి మంగయ్య, జాన్‌సైదా, ఎస్టీకాలనీ గ్రామపెద్దలు పాల్గొన్నారు



శ్రీ బగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటున్న మాడా సుబ్రహ్మణ్యం తదితరులు

వేదస్మార్త శాస్త్ర గురుకుల పాఠశాలను సందర్శించిన ఎంపీ తెన్నేటి

బాపట్ల, జూలై 7 : పట్టణంలోని శ్రీ శంకర విద్యాలయం వేదస్మార్త శాస్త్ర గురుకుల పాఠశాలను ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ ఆదివారం సాయంత్రం సందర్శించారు. యాజమాన్యం ఆయనకు ఘనస్వాగతం పలికారు. వేద పాఠశాలలోని శ్రీదత్తాత్రేయ మందిరంలో ఎంపీ పూజ జరిపించారు. ఆయనను శేషవస్త్రం, శాలువాతో సత్కరించారు. అధ్యాపకులు, విద్యార్థులు, అర్చకులు స్వామి వారి ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో డబ్ల్యు జికె.మూర్తి, బి.బాబునాగేంద్ర, ఏఎస్‌వీఆర్ఎన్ చలపతిరావు, భుజిగేంద్రమౌళి, విజిఎస్ ప్రతాప్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

● బాపట్ల పార్లమెంట్ పరిధిలోని దివ్యాంగులకు ట్రైసైకిళ్ళు, బ్యాటరీ వాహనాలు, సంకక్రలు, వీల్‌చైర్‌లు, వినికిడి యంత్రాలు, సెల్‌ఫోన్‌లు వంటివి అందించే విధంగా చూడాలని కోరుతూ జనసేన పార్టీ దివ్యాంగుల నాయకుడు గోగన ఆదిశేషు ఆదివారం ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కంది వెంకటరెడ్డి, పి.లక్ష్మీ, డి.వీర్రాజు, వినీత్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచాలి

కొల్లూరు, జూలై 7 : గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న కార్మికులు అందరికి రూ.26 వేలు నెలసరి వేతనం అందించాలని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లారావు డిమాండ్ చేశారు. ఆదివారం కొల్లూరులోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం నిత్యవసర సరుకులతో పాటు అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని, కానీ పంచాయతీ కార్మికుల జీతాలు మాత్రం పెరగడం లేదన్నారు. కుటుంబ పోషణ కోసం కార్మికులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని దీంతో వారి జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వారి అవస్థలు గుర్తించి ప్రతి కార్మికుడికి రూ.26 వేలు వేతనం అందించి ఆదుకోవాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ కూడా అమలు చేయాలని, సబ్బులు, చెప్పులు, నూనె, యూనిఫాం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం పంచాయతీ కార్మిక సంఘాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బొనిగల సుబ్బారావు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

అనంతవరంలో 'చదవటం మాకిష్టం' కార్యక్రమం

కొల్లూరు, జూలై 7 : మండల పరిధిలోని అనంతవరం శాఖా గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల పుస్తక పఠనాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, పుస్తక పఠనం ద్వారా విద్యార్థులకు అపర విజ్ఞానం లభిస్తుందన్నారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేయాలని సూచించారు. గ్రంథాలయ రికార్డులను పరిశీలించి పాఠకుల హాజరు శాతాన్ని గమనించారు. గ్రంథాలయ అభివృద్ధి కోసం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జి.కనకదుర్గ, పాఠకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ విఘ్నేశ్వరస్వామి దేవాలయ వార్షికోత్సవం

పిట్టలవానిపాలెం, జూలై 7 : మండలంలోని సంగుపాలెం కోడూరు గ్రామంలో ఉన్న శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవాలయ ప్రథమ వార్షిక వేడుకలను ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆదివారం అర్చకులు భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పూజలు అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంగుపాలెం, కోడూరు గ్రామాలకు చెందిన భక్తులు, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

వేమూరు, జూలై 7 : మండలంలోని కుచ్చెళ్ళపాడు గ్రామంలో గుంటూరు ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ గాజుల వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో జరిగిన సేవా కార్యక్రమంలో 800 మంది రోగులను వైద్యులు పరీక్షించారు. గుండెజబ్బులు, గ్యాస్ట్రిక్ సమస్య, ఎముకలు, వెన్నుపూస సమస్యలతో కూడిన రోగులను పరీక్షించి ఉచిత మందులను పంపిణీ చేశారు. డాక్టర్ పి.కృష్ణప్రసాద్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ భరత్‌కుమార్ ఆసుపత్రి సిబ్బంది తమ సేవలను అందించారు. వైద్యులను, సిబ్బందిని సర్పంచ్ వెంకట సుబ్బయ్య అభినందిస్తూ సత్కరించారు.

పాత కక్షల నేపథ్యంలో దాడి

రేపల్లె, జూలై 7 : పాత గొడవల నేపథ్యంలో దారికాచి ఊలుపాలేనికి చెందిన ఆటోడ్రైవర్ కైతేపల్లి నాగరాజుపై అదే గ్రామానికి చెందిన వ్యక్తులు అరవపల్లి గ్రామం సమీపంలో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో మండలంలోని అరవపల్లి చికెన్‌కొట్టు సమీపంలో నాగరాజుపై పాత గొడవల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన 12 మంది కర్రలతో విచక్షణారహితంగా కొట్టి గాయపరిచారు. స్థానికులు అడ్డుకోవటంతో పరారయ్యారు. దాడికి గురైన నాగరాజును ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు. దీనిపై పట్టణ ఎస్ఐ హరిబాబు కేసు నమోదు చేసి ఊలుపాలేనికి చెందిన 12 మందిపై కేసు నమోదు చేశామని, విచారించి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

మూగ జీవాలకు రక్తపూతల కేంద్రం

● 30 రకాల పరీక్షలు ఉచితం

● హర్షం వ్యక్తం చేస్తున్న పాడి రైతులు



వేమూరు వెటర్నరీ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న టెక్నీషియన్

వేమూరు, జూలై 7 : నియోజకవర్గ కేంద్రమైన వేమూరులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఎంతో ప్రయోజనకరంగా ఉందంటూ పాడి రైతులు హర్షం వ్యక్తపరుస్తున్నారు. ప్రయోగశాలలో గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, పెంపుడు కుక్కలకు సంబంధించిన 30 రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారు. రూ.వంద నుంచి రూ.వెయ్యి ఖరీదు గల పరీక్షలను ప్రయోగశాలలో నిర్వహించడం ద్వారా వేమూరు, కొల్లూరు, చుండూరు మండలాల పరిధిలో ఉన్న 59గ్రామాల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. గతంలో పశువులకు సంబంధించిన పరీక్షల నిమిత్తంగా గుంటూరు కేంద్రానికి ఎంతో ప్రయాసతో వెళ్ళాల్సి వచ్చేది. ప్రభుత్వం పశు సంవర్థక శాఖలో తీసుకువచ్చిన నూతన ప్రణాళికలలో భాగంగా మూడు మండలాల స్థాయిలో ప్రయోగశాలను ఏర్పాటు చేయడంపై ఆ శాఖకు చెందిన సిబ్బంది కూడా హర్షం వెలిబుచ్చుతోంది. రూ.10 లక్షల పైబడిన నిధులతో నూతన సాంకేతికపరమైన ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో బయో కెమిస్ట్రీ అనలేజర్ ద్వారా 18 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. కిడ్నీ, గుండె, లివర్, పొదుగు వాపు, బాలింత జబ్బులు, చర్మవ్యాధులు, బ్రూసెల్ల తదితర వ్యాధులకు సంబంధించిన పరీక్షలను నిర్వహిస్తున్నారు. ప్రత్యేక కోర్సులలో ఉత్తీర్ణులైన వారిని ల్యాబ్ టెక్నీషియన్లుగా నియమించారు. సంచార పశు వైద్యశాల ద్వారా గ్రామాలలోని పశువుల రక్త పరీక్షల శాంపిల్స్‌ను ఏ రోజు కారోజు ల్యాబ్‌కు అందిస్తున్నారు. నిర్ణీత సమయంలో ఫలితాలను కూడా అందించి ఆయా గ్రామాల పరిధిలోని వైద్యులు చికిత్సను నిర్వహించడం ద్వారా ఎంతో ఫలితాలను సాధిస్తున్నారు.

ఎంతో ఉపయోగకరంగా ఉంది



గతంలో గుంటూరులో పరీక్షలు చేయించి సకాలంలో ఫలితాలు అందక చికిత్సకు సరైన సహకారం లేక పశువులను కోల్పోయాం. ఇప్పుడు అలాంటి ఇబ్బంది లేకుండా సకాలంలో నాణ్యమైన చికిత్సను పొంది పశువులను కాపాడుకోవడం జరుగుతోంది.

- ఎలిచర్ల దివాకర్, పాడి రైతు, వేమూరు.

రెండేళ్ళలో ఆరు వేల పరీక్షలు



రెండు సంవత్సరాల కాలంలో మూడు మండలాల పరిధిలో 6 వేలకు పైగా మూగ జీవాలకు చెందిన అనేక వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించాం. తద్వారా త్వరితగతిన వ్యాధి నిర్ధారణతో పాటు మెరుగైన వైద్య సేవలను అందించడం జరుగుతోంది. రైతులు ఈ సేవలు వినియోగించుకోవాలి.

- సహాయ సంచాలకులు డాక్టర్ జనార్ధనరావు

విభజన సమస్యల పరిష్కారానికి చంద్రబాబు కృషి ప్రశంసనీయం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల

భట్టిప్రోలు, జూలై 7 : రాష్ట్ర అభివృద్ధికి, విభజన సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబునాయుడు కృషి ప్రశంసనీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఐదు సంవత్సరాల దుష్టపరిపాలనలో రాష్ట్రం అభివృద్ధిలో 30 సంవత్సరాలు వెనక్కి వెళ్ళిందన్నారు. అలాంటి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పయనింపజేసేందుకు రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబునాయుడు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సీఎం హోదాలో చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటనలో ప్రధానమంత్రి, వివిధ కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర అభివృద్ధి కోసం చేసిన పలు ప్రతిపాదనలను కేంద్రం ఆమోదించడం చంద్రబాబునాయుడు చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన అన్నారు. జగన్‌రెడ్డి పరిపానలో 30 సార్లు ఢిల్లీ పర్యటన చేసి సాధించలేని అనేక సమస్యలను చంద్రబాబునాయుడు ఒక్క పర్యటనతోనే సాధించడంతో చంద్రబాబు పరిపాలన దక్షత స్పష్టంగా అర్థమవుతుందన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయించిన చంద్రబాబునాయుడు రాష్ట్ర విభజన చట్టంలోని 9, 10 షెడ్యూళ్ళలోని సమస్యలను సామరస్య ధోరణిలో పరిష్కరింపజేయడానికి చంద్రబాబు చాణక్యత అనితర సాధ్యమని ఆయన అన్నారు. గత ఐదు సంవత్సరాలలో విభజన చట్టంలోని సమస్యల పరిష్కారానికి చొరవ చూపలేదని, ఫలితంగా ఆంధ్ర రాష్ట్రం ఎంతో నష్టపోయిందని సాయిబాబా అన్నారు

కూటమి గెలుపుతో మొక్కులు చెల్లిస్తున్న టీడీపీ నాయకులు

చెరుకుపల్లి, జూలై 7: ప్రజా ప్రభుత్వం ఏర్పాటుతో ప్రజలు సంతోషంగా ఉన్నారని పార్లమెంట్ టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు గోగినేని వసుధ అన్నారు. మండలంలోని నడింపల్లిలో కొలువైన రెడ్లంకమ్మ అమ్మవారికి ఆదివారం మొక్కులు చెల్లించారు. ప్రత్యేక పూజలు చేసి పొంగళ్ళను చేశారు. కూటమి గెలవాలని, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, మంత్రిగా అనగాని సత్యప్రసాద్‌ను చూడాలని మొక్కుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గోగినేని వెంకట సుబ్బారావు, కొడాలి తల్పసాయి, రామమోహన్‌రావు, గోగినేని రామాంజనేయులు, సురేష్, మల్లాది శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నడింపల్లిలో రెడ్లంకమ్మతల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న టీడీపీ నాయకులు

వసతి గృహాలకు ఫ్యాన్లు పంపిణీ

రేపల్లె, జూలై 7 : పట్టణంలోని వసతి గృహాలకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఫ్యాన్లు, మూడు కార్పెట్లు, జాతీయ జెండా దిమ్మెకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందించినట్లు రోటరీ క్లబ్ కార్యదర్శి పావులూరి శివశంకర్ ప్రసాద్ తెలిపారు. వసతి గృహాల్లో ఫ్యాన్లు, కార్పెట్లు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో ఫ్యాన్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, రోటరీ క్లబ్ దృష్టికి తీసుకురావటంతో ఏడు ఫ్యాన్లు, మూడు కార్పెట్లను అందించామని తెలిపారు. సేవా గుణంతో రోటరీక్లబ్ ముందుకు వెళుతుందని తెలిపారు. 2024-25 సంవత్సరానికి రోటరీ క్లబ్ ఆఫ్ రేపల్లె రూరల్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగిందని చెప్పారు. అధ్యక్షుడిగా కోడూరి కృష్ణమూర్తి, కార్యదర్శిగా కేసన వెంకట నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా తలశిల రామారావు, కోశాధికారిగా వేపూరి సాయేశ్వరరావు, క్లబ్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా జీ.శ్రీనివాసరావు వారితో పాటు మరికొందరిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు మాలాల మోహన్ సక్సేనా, వేములపల్లి రాఘవేంద్రరావు, గొట్టుముక్కల బాపారావు, మల్లెల రామచంద్రరావు, పి.రామకృష్ణ, జి.సుబ్రహ్మణ్యం, జీ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వసతి గృహంలో ఫ్యాన్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

మార్కెట్ యార్డు సిబ్బందికి యూనిఫామ్ పంపిణీ



సిబ్బందికి యూనిఫాం పంపిణీ చేస్తున్న విజయ్‌బాబు

వేమూరు, జూలై 7 : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పని చేస్తున్న సిబ్బందికి ఆదివారం యూనిఫాం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. యార్డు కార్యదర్శి అంజిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బాపట్ల పార్లమెంటరీ స్థాయి తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా సిబ్బందికి యూనిఫామ్ పంపిణీ చేయించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కోగంటి రాజేష్, కొండ్రు బుల్లియ్య, రామదాసు, ఎ.ప్రసాద్, గోపినాథ్, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు స్వచ్ఛందంగా పంట కాల్వల్లో పూడిక తీత పనులు

కొల్లూరు, జూలై 7 : పంట కాల్వల పూడికతీత పనులను రైతులు స్వచ్ఛందంగా చేపట్టారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో కాల్వల ద్వారా సాగునీరుకు ఆటంకంగా తూటికాడ, గుర్రపు డెక్క తదితర వ్యర్థాలతో నిండిపోవడంతో వాటిని రైతులు స్వచ్ఛందంగా తొలగింపజేస్తున్నారు. కొల్లూరులోని లాకుల వద్ద, దోనేపూడి నుంచి కొల్లూరు అచ్చమ్మ చెరువు, చినపులివర్రు వరకు ఉన్న పంట కాల్వలలో ఎక్స్‌కవేటర్ సాయంతో వ్యర్థాలను తొలగింపజేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో కూడా సాగునీటి శాఖాధికారులు పంట కాల్వల పూడికతీతలు, వ్యర్థాలు తొలగింపులు చేపట్టకపోవడంతో ఆయకట్టు రైతులు సాగునీరు అందక ఇబ్బందులకు గురయ్యారు. అటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సాగునీటి విడుదలకు ముందే తమ పరిధిలో ఉన్న పంట కాల్వలలో వ్యర్థాలను రైతులే తొలగించుకుంటున్నారు. ఆయా కార్యక్రమాలను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, పార్టీ నాయకులు నిమ్మగడ్డ అనిల్, వెనిగళ్ల మహేష్, బొప్పన హేమంత్‌కుమార్, గద్దె నాగేశ్వరరావు, సూర్యదేవర పసి, మున్నంగి విజయ్, చంటి రైతులు, పాల్గొన్నారు.



దోనేపూడి పరిధిలో పంట కాల్వల్లో పూడిక తీయిస్తున్న టీడీపీ నాయకులు, రైతులు

నిజాయితీ వర్సెస్ నిందలు..!

- ఐదేళ్లలో పేరుకుపోయిన అవినీతి, అక్రమాలపై ఎమ్మెల్యే కొండయ్య ప్రత్యేక దృష్టి
- అక్రమార్కుల గుండెల్లో గుబులు
- అబద్ధాలను వండివారుస్తున్న వైరిపక్షం

చీరాల, జూలై 7 : చీరాల నియోజకవర్గంలో గత ఐదేళ్ల కాలంలో అవినీతి, అక్రమాలు పెచ్చరిల్లాయి. వాటి ప్రక్షాళనకు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కార్యాచరణ చేపట్టారు. అందులో భాగంగా తీరప్రాంతంలో జరిగిన వరుస మరణాల నేపథ్యంలో రిసార్టుల నిర్వాహకులు తీసుకోవల్సిన జాగ్రత్తలను తప్పకుండా అనుసరించాలని స్పష్టం చేశారు. ఒకటికి రెండు పర్యాయాలు పోలీస్ అధికారులు, రిసార్టుల నిర్వాహకులతో సమీక్ష చేశారు. ఇక రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేపడుతున్న అక్రమ లే-అవుట్లతో కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. ఆ క్రమంలో పక్కా లేఅవుట్‌లతో అడుగులు వేయాలని స్పష్టం చేశారు. నియోజవకర్గంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రెండు రోజుల కిందట టీడీపీ శ్రేణులు ఇసుక, రేషన్ బియ్యం అక్రమ దందాలను అరికట్టాలని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. గడియార స్తంభం సెంటర్లో నినాదాలు చేశారు. ఇలా ఒకటొకటిగా అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు, ప్రజా ప్రయోజనాలు కాపాడేందుకు ఎమ్మెల్యే కొండయ్య చేపడుతున్న కార్యక్రమాలతో అక్రమార్కులలో కొందరు పరోక్షంగా ఎదురు దాడికి దిగారు. ఆ క్రమంలో విషం చిమ్ముతూ అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. దీనిపై టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

రియల్ ఎస్టేట్ వ్యాపారంకు సంబంధించి సదరు రియల్టర్లు వేసే అడుగులు నిబంధనలు మేరకు సాగుతున్నాయా..? లేదంటే తమ ప్రయోజనాల కోసం కీలక వ్యక్తులపై ఆరోపణలు చేస్తున్నారా అనే అంశంపై జోరుగా చర్చ సాగుతోంది. ఎమ్మెల్యేకు పరోక్షంగా ఓ రియల్టర్ 30 సెంట్ల భూమిని అప్పనంగా కట్టబెట్టారని కొందరు విష ప్రచారం చేస్తున్నారు. అయా ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని సదరు రియల్టర్‌లు స్పష్టం చేస్తున్నారు. అందుకు సంబంధించి ఆ రియల్టర్లు రాతపూర్వకంగా వివరణ ఇచ్చారు. అలానే రేషన్ బియ్యానికి సంబంధించి ఎమ్మెల్యేకు పరోక్షంగా ముడుపులు అందాయనే ఆరోపణలను చేసే వ్యక్తులు కొందరు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చారు. తీరప్రాంతంలో రిసార్టుల నిర్వాహకుల నుంచి డబ్బు కోరారని కొందరు అసత్య ప్రచారాన్ని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తన పరపతిని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులు, సంస్థలపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు ఎమ్మెల్యే కొండయ్య అడుగులు వేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

లే-అవుట్లు నిబంధనల మేరకు వేయాలి..

కొనుగోలుదారులకు ఇబ్బంది లేకుండా చూడాలి

కొన్ని సంవత్సరాలుగా చీరాల నియోజకవర్గంలో అప్రూవ్డ్ లేఅవుట్లు ఒకటి, రెండుకు మించి లేవు. అనధికారిక లేఅవుట్లు పుట్టగొడుగుల్లా ఉన్నాయి. అందులో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు తమ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టేందుకు కనీసం విద్యుత్ లైన్లు కూడా లేక ఇబ్బంది పడుతున్నారు. తాజాగా అధికార పార్టీకి చెందిన కీలకనేత సదరు రియల్టరు నుంచి 30 సెంట్ల భూమి నజరానాగా పొందినట్లు కొందరు విషం చిమ్ముతున్నారు. ఆ విషయం నియోజకవర్గంలో చర్చకు దారితీసింది. ఎమ్మెల్యే ముందస్తుగానే చేసిన ప్రకటనలపై వాస్తవాన్ని వక్రీకరిస్తున్నారని ప్రజలు నమ్ము తున్నారు.

ప్రాణహాని జరగకూడదంటే.. పైసలతో ముడిపెడతారా..?

చీరాల నియోజకవర్గంలో రేషన్ బియ్యం అర్హులకే చెందాలి. అవి నల్ల బజారుకు తరలకూడదు. నిబంధనలను అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. ఈ మాటలు ఎమ్మెల్యే కొండయ్య డీలర్లకు, మిల్లర్లకు స్పష్టం చేశారు. అయితే కొందరు అదే పనిగా పనిగట్టుకుని రేషన్ బియ్యంకు సంబంధించి ఎమ్మెల్యేకు ముడుపులు

రేషన్ విషయమై ఒక్క రూపాయి ఇవ్వలేదు

అందాయనే ప్రచారం చేస్తున్నారు. ఇది ముమ్మాటికీ అవాస్తవం. రేషన్ విషయమై ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రేషన్ డీలర్స్‌పరంగా తామిచ్చే సమాధానం ఇదే.

- డీ ప్రభాకరరావు, రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

తీరప్రాంతంలో ఇటీవల కొన్ని దుర్ఘటనలు జరిగాయి. అందుకు కొందరు ప్రాణాలు మూల్యంగా చెల్లించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కొండయ్య, రిసార్ట్స్ నిర్వాహకులు, పోలీస్ అధికారులతో ఉమ్మడి సమావేశం నిర్వహించారు. తీరంలో ప్రాణనష్టం ఘటన ఆఖరు కావాలి. భవిష్యత్‌లో అలాంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకుందాం. రిసార్ట్స్ నిర్వాహకులు కార్యాచరణతో పనిచేయాలని ఎమ్మెల్యే చెప్పారు. దీనిపై బీచ్ రిసార్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు అడుగులు వేశారు. గజఈతగాళ్ల నియామకం, సెర్చ్ టవర్స్ ఏర్పాటు, లైఫ్ జాకెట్లు తదితరాలు సమకూర్చేందుకు నిధులు సమకూర్చగా అవి ఎమ్మెల్యే కోసమని కొందరు అసత్యాలను వండివారుస్తున్నారు. దానిని ఖండిస్తూ పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని రిసార్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయమై అసత్యాలను ప్రచారం చేసేవారిపై అవసరమైతే తగిన చర్యలు తీసుకునేందుకు అడుగులు వేస్తామని చెప్తున్నారు.

నిందలు వేసిన వారు నిజనిరూపణ చేయాలి..

లేదా శిక్షను అనుభవించాలి

రిసార్టుల నిర్వహణ నుంచి, రేషన్ బియ్యం, రియల్ ఎస్టేట్ వ్యాపారం వరకు నిందలు మోపినవారు నిజనిరూపణ చేయాలి. లేదంటే శిక్ష అనుభవించాలని టీడీపీ శ్రేణులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. వాస్తవాలను వక్రీకరించి సదుద్దేశంతో పనిచేసే వారిని నైతికంగా దెబ్బతీసేందుకు, తమ వ్యక్తిగత ప్రయోజనాలను కాపాడుకునేందుకు ప్రయత్నం చేస్తున్న వ్యక్తులు, సంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ, జనసేన, బీపేపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

వాస్తవాలను పరిశీలించి చర్యలు చేపడతాం

లేఅవుట్ల నుంచి, సీఆర్‌జడ్ వరకు నిబంధనలు ఏం ఉన్నాయి. వాటిని పాటించారా. పాటిస్తున్నారా. లేదంటే అతిక్రమణకు ఏం చర్యలు చేపట్టాలనే అంశాలతో ఇతర అంశాలకు సంబంధించి కూడా ఉన్నతాధికారులకు సమగ్ర నివేదికను సమర్పిస్తాం. అనంతరం తదుపరి చర్యలు చేపడతాం.

- సూర్యనారాయణరెడ్డి, ఆర్డీవో, చీరాల



డాక్టర్ నాగసూరి దంపతులకు పురస్కారాన్ని అందజేస్తున్న సభ్యులు

సాహితీవేత్త నాగసూరికి పురస్కారం

- వెలుగు చూడని గ్రంథాలను నేటి తరానికి అందిస్తున్న రచయిత
- సన్మాన సభలో వక్తలు

అద్దంకిటౌన్, జూలై 7 : వెలుగు చూడని గ్రంథాలను వెలికితీసి అందులో ఆంతర్యాన్ని నేటి తరానికి అందజేస్తున్న సాహితీవేత్త డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ అని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం స్థానిక శ్రీనివాస ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ సాహిత్య పురస్కార సభ పద్యకవి డీవీఎం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హాజరైన ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరి శ్రీనివాసులు మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమ నాగసూరి ఉన్నతికి మార్గాలన్నారు. ఎనిమిది పదుల పుస్తకాలకు సంపాదకత్వం వహించారని, మాధ్యమాల విశ్లేషకులని, పాఠ్యాంశాల రచయితని, మూడు వేలకు పైగా సాహిత్య వ్యాసాలు రాసిన సాహితీవేత్త అని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా రచయిత నాగసూరి వేణుగోపాల్‌కు పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ సాహిత్య పురస్కారం-2024ను పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులకు అందజేయగా, వేణుగోపాల్ దంపతులను ఈ సందర్భంగా సాహితీ మిత్ర మండలి సభ్యులు సత్కరించారు. గాంధీజీ మార్గం నేటికీ అనుసరణీయమని డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ అన్నారు. మీడియా రంగం అతి దోరణులను వీడి సమాజహిత కార్యక్రమాలు రూపొందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గాడేపల్లి దివాకర్‌దత్తు, డాక్టర్ యు. దేవపాలన, అన్నమనేని వెంకట్రావు, లక్కరాజు శ్రీనివాసరావు, రాఘురామశర్మ, మారం కోటేశ్వరరావు, రఫీ, సందరెడ్డి శ్రీనివాసరావు, అంజాద్ బాషా, హనుమంతరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటికి 104 ఉద్యోగుల వినతి



మంత్రి గొట్టిపాటిని కలిసిన 104 ఉద్యోగులు

అద్దంకిటౌన్, జూలై 7 : ఏపీ 104 ఎంఎంయూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను చిలకలూరిపేటలోని తన నివాసంలో ఉమ్మడి ప్రకాశం, బాపట్ల జిల్లా యూనియన్లు కలిసి వినతిపత్రం అందజేశారు. ముందుగా ఘన విజయం సాధించిన గొట్టిపాటికి అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో అనేక సంవత్సరాలుగా వైద్య, ఆరోగ్య శాఖలో సేవలందిస్తున్నామని, అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటూ కోవిడ్ సమయంలో విధులు నిర్వర్తించామన్నారు. ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నియామకాలల్లో మాకు వెయిటేజీని ఇవ్వకుండా గత ప్రభుత్వం వివక్షత చూపిందన్నారు. నెలనెలా సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని, సమస్యలపై వినతులు ఇచ్చినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా పరిష్కారం చూపాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా యూనియన్ అధ్యక్షుడు నరేష్, జనరల్ సెక్రటరీ రవి వర్మ, డివిజన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు నిలిపివేత



ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న ఎస్ఐ

చినగంజాం, జూలై 7 : మండలంలోని చినగంజాం సర్వే నెంబర్లు 828, 829లోని భూములలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలను చినగంజాం ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు ఆదివారం నిలిపివేశారు. శనివారం నుంచి ఆ భూములలో అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో ఆ ప్రాంతనికి ఎస్ఐ వెళ్లి విచారణ చేసి, ఇసుక తరలించేందుకు అనుమతులు లేకపోవడంతో, అక్రమంగా ఇసుక రవణా చేస్తున్నారని నిర్ధారించుకుని ఇసుక తవ్వకాలను అడ్డుకున్నారు. అనుమతులు ఉంటేనే ఇసుక తవ్వకాలు జరపాలని, అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపి, రవణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు ఇసుక అక్రమ తవ్వకాలను నిలిపివేసినట్లు ఎస్ఐ తెలిపారు. చినగంజాం గ్రామ సర్వే నెంబర్లు 828, 829లలోని భూములలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపి వేయాలని కోరుతూ సీపీఎం పార్టీ జిల్లా నాయకులు జి.ప్రతాప్‌కుమార్ శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వైసీపీ హయాంలో దొంగ ఆన్‌లైన్లు, నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలతో ఇసుక దోపిడీ చేశారని ప్రతాప్ కుమార్ తెలిపారు. ఇసుక అక్రమ రవణా, దొంగ ఆన్‌లైన్లు, నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలను రద్దు చేయాలని, ఆ భూములు ఎస్టీల భూములు కనుక ఎస్టీలకే కేటాయించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

చినుకుపడితే రోడ్లన్నీ జలమయం

- అస్తవ్యస్తంగా సైడ్ కాలువలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి



పట్టణంలోని కాకానిపాలెం మండపం నుంచి నామ్ రోడ్డుకు వెళ్లే దారిలో నిలిచిన వర్షపు నీరు

అద్దంకి, జూలై 7 : అద్దంకి మున్సిపాలిటీగా మారినా వసతులు మాత్రం గ్రామస్థాయి పరిస్థితుల కంటే దారుణంగా ఉన్నాయంటే ఆశ్చర్యం కలుగక మానదు. చిన్నపాటి వర్షం పడ్డా రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. ప్రధానంగా అత్యధిక శాతం సైడ్ డ్రైన్‌లు పాతవి కావడం, శిథిలావస్థకు చేరి మురుగు, వర్షపు నీరు ప్రవహించే వీలు లేకుండా పోవటం తో సమస్యలు ఏర్పడుతున్నాయి. అదే సమయంలో రోడ్లు పక్కన ఉన్న భవనాల ముందు రోడ్ల కంటే ఎత్తు ఉండటంతో వర్షపు నీరు సైడ్ డ్రైన్‌లలోకి చేరే వీలు లేక సీసీ రోడ్ల పైనే నిలిచిపోతున్నాయి. ఇక పట్టణంలో శివారు కాలనీ లలో అత్యధిక శాతం గ్రావెల్ రోడ్లు కావటం తో చినుకుపడితే నడవలేని పరిస్థితి ఉంది. ప్రధానంగా గరటయ్య కాలనీ, ఎన్టీఆర్ నగర్ తదితర ప్రాంతాలలో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. ఆర్టీసీ బస్టాండ్‌లో నీరు నిలిచి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వచ్చేది వర్షాకాలం కావడంతో వర్షాలు మరింత ఎక్కువగా పడే అవకాశం ఉంది. దీంతో వర్షపు నీరు నిలిచి వ్యాధులు ప్రబలే అవకాశం కూడా ఉందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వర్షపు నీరు రోడ్లపై నిలువకుండా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

మార్టూరులో ఇసుక రీచ్‌పై వివాదం



మార్టూరు, జూలై 7 : రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తీసుకురానున్నది. ఈ నేపథ్యంలో గత వైసీపీ పాలనలో అక్రమంగా ప్రజలను దోచుకున్న ఇసుక రీచ్‌ల నిర్వాహకుల నుంచి ప్రస్తుతం ఉన్నత అధికారుల ఆదేశాలమేరకు రెవెన్యూ అధికారులు ఇసుక రీచ్‌లను స్వాధీనం చేసుకుంటున్నారు. అయితే మార్టూరులో డంపింగ్ చేసిన ఇసుక రీచ్‌లో కొంత వివాదాస్పద వాతావరణం ఏర్పడింది. ఈ ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయడం కోసం సంబంధిత కంపెనీకి స్థలాన్ని లీజుకు ఇచ్చిన వ్యక్తి తనకు రావలసిన అద్దె బకాయిలు రాకపోవడంతో ఇసుక రీచ్‌ను అధికారులకు స్వాధీనం చేయడానికి అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో మార్టూరులో ఇసుకరీచ్ ఏర్పాటుకు ఒక కంపెనీకి ప్రభుత్వం కాంట్రాక్టు ఇచ్చారు. వారు మార్టూరు లో అసిస్ట్ పాలకేంద్రం సమీపంలో ఇసుకరీచ్ ను ఏర్పాటు చేశారు. అందు కోసం మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందినఒక వ్యక్తి స్థలాన్ని లీజుకు తీసుకున్నారు కాని ఇసుక సక్రమంగా అమ్ముడుపోకపోవడం వలన కంపెనీ వారు ఇసుకరీచ్ నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. చీరాల ఇసుక కావడంతో ఎక్కువగా ఇసుక అమ్ముడుపోలేదని తెలిసింది. ప్రస్తుతం అక్కడ సుమారు 1900 క్యూబిక్ మీటర్లుపైగా ఇసుక ఉన్నట్లు తెలిసింది. అయితే లీజుదారునికి ఇప్పటికి ఇంకా సుమారు 4 లక్షలు రూపాయలు అద్దె రూపంలో రావాల్సి ఉందని, అందువలన లీజు డబ్బులు చెల్లించేంతవరకూ ఇసుక రీచ్‌ను స్వాధీనం చేయనని అధికారులకు స్థల యజమాని తరపు వారు చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం మైనింగ్ ఏడీ, ఎంపీడీవో నితిన్, యద్దనపూడి మండల ఇన్‌చార్జి తహసీల్దార్ వై.నాగరాజు, సీఐ రాజశేఖర్‌రెడ్డి ఇసుక రీచ్ వద్దకు వచ్చి స్థలంలో ఉన్న ఇసుకను కొలతలు వేసినట్లు తెలిసింది. అదేవిధంగా లీజుదారుడు తనకు రావలసిన అద్దె బకాయిలపై కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తితో మాట్లాడుకోవాలని, ఈ విషయంపై అధికారులతో తర్వాత చర్చించుకోవాలని మొదట ఇసుకరీచ్‌ను స్వాధీనం చేసుకుంటున్నామని స్థల యజమానికి అధికారులు చెప్పినట్లు తెలిసింది. దాంతో సీఐ రాజశేఖర్ రెడ్డి పోలీసులను అక్కడ కాపలాగా ఏర్పాటు చేశారు. ఆదివారం కూడా ఇసుకరీచ్ వద్ద రెవెన్యూ, పోలీసు కాపలా కొనసాగింది. సోమవారం నుంచి ఇసుకరీచ్ వద్ద ప్రజలకు ఉచిత ఇసుకను పంపిణీ చేయడం జరుగుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

గాయపడిన వానరం

చికిత్సను చేసిన వైద్య సిబ్బంది



వానరానికి చికిత్స చేస్తున్న వైద్యులు

మార్టూరు, జూలై 7 : చెట్టుపై నుంచి కిందపడిన వానరానికి మార్టూరు లోని పశు వైద్యశాల సిబ్బందిచి చికిత్సను అందించారు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. మార్టూరు గ్రామ పంచాయతీ సమీపంలో చెట్టుపైన ఎగురుతున్నవానరం జారి నేలపై పడింది. దాంతో అది అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. విషయాన్ని గమనించిన స్థానికులు ఈ వానరాన్ని ప్రభుత్వ పశు వైద్యశాలకు తీసుకువెళ్లారు. అక్క డ పశు వైద్య సహాయకుడు జీ గోపి, వైద్య సిబ్బంది శ్రీను వానరానికి చికిత్సను అందించారు. అనంతరం కోలుకున్న వానరం వెళ్లిపోవడంతో అంద రూ సంతోషించారు.

శ్రీ అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

- ఆలయ అభివృద్ధికి రూ.40లక్షల విరాళం
- చెక్కును అందజేసిన జనసేన నాయకుడు శ్రీకాంత్



ఆలయ అభివృద్ధికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న మన్నెం

పర్చూరు, జూలై 7: పర్చూరులోని 92 అడుగుల శ్రీ అభయాంజనేయస్వామివారి విగ్రహ ఆలయ ప్రాంగణంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రవాశాంధ్రుడు, జనసేన యువనేత మన్నెం శ్రీకాంత్ పాల్గొన్నారు. అలయ అభివృద్ధికి రూ.40లక్షల విరాళాన్ని ప్రకటించి దానికి సంబంధించిన చెక్కును ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీకాంత్‌ను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి రిటైర్డ్ ప్రిన్సిపాల్ మంగళగిరి కోటేశ్వరరావు మాట్లాడుతూ పర్చూరులో రూ.4కోట్ల వ్యయంతో దాతల సహకారంతో రూపుదిద్దుకున్న ఆలయాన్ని భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు దాతలు అందిస్తున్న సాయం హర్షనీయం అని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కోటా హరిప్రసాద్, కఠారి సురేంద్రబాబు, రంగిశెట్టి ఆంజనేయులు, తులసి అప్పారావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి నరసింహం, రంగిశెట్టి రామాంజనేయులు, జనసైనికులు తోట మణి, దీర్ఘాల రమేష్ నాయుడు, మాధవ మాస్టర్, తులసి చంటి, కందా సురేంద్ర, అచ్చికోలు సతీష్, బాలాజీ, గోగుల శ్రీనివాసరావు, దాసరి సాంబయ్య పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొండయ్య

అభివృద్ధే కొలమానంగా పనిచేస్తాం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 7 : నియోజకవర్గంలో అభివృద్ధే కొలమానంగా పనిచేస్తాం. అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం నియోజకవర్గం పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, శిలాఫలాకాల ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ తీరప్రాంతంలో రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు వాడరేవు నుంచి రామాపురం మీదుగా పొట్టి సుబ్బయ్యపాలెం వరకు నిర్మించనున్న డబుల్ రోడ్డుతో పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అంతకు ముందు చీరాల మండలం బోయినవారిపాలెం నుంచి వాడ, రెడ్డిగారి కాలువ మీదుగా కుంకలమర్రు వరకు రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రాత్రికి రోటరీ సామాజిక భవనంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్టీయు అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, ఎంఈవో సుబ్రమణ్యేశ్వరరావు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చీరాల మండలం గవినివారిపాలెంలోని మేకలదిబ్బ నిర్వహించిన కనకనాగారపమ్మ అమ్మవారి కొలుపులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం కలసి పనిచేద్దాం

అభివృద్ధి కోసం అందరం కలసి పనిచేద్దామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రముఖ సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అభిమానులకు చెప్పారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం బాలకృష్ణ అభిమానులు ఎమ్మెల్యే కొండయ్యను మార్యాదపూర్వకంగా కలిశారు.

అనంతవరం మాజీ సర్పంచ్ మృతి

యద్దనపూడి, (మార్టూరు) జూలై 7 : యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామ మాజీ సర్పంచ్ పెడవల్లి కామేశ్వరరావు (75) అనారోగ్య కారణంగా శనివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా, నాయకునిగా క్రమశిక్షణ గలిగిన వ్యక్తిగా పార్టీ కోసం నిరంతరం పనిచేశారు. కొంతకాలం అనారోగ్యంతో ఉన్నారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఒక ప్రకటనలో ఆయన కుటుంబానికి తన సంతాపం తెలియజేశారు. ఆదివారం సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సేవా సమితి కమిటీ సభ్యులు

బల్లికురవ, జూలై 7 : చిటిపోతు, చిడిపోతు వంశస్తుల సేవా సమితి ద్వారా సేవా కార్యక్రమాలను నిరంతరం చేపడతామని అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య తెలిపారు. ఆదివారం మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో చిటిపోతు, చిడిపోతు సేవా సమితి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో విజయవాడ హెల్ప్ వైద్యశాల సహకారంతో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈసందర్భంగా శిబిరాన్ని సేవా సమితి అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య ఆయన భార్య లలిత, కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గుండెకు సంబంధించి వైద్యాధికారి సాయికుమార్ 205 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 40 మందికి ఉన్నత చికిత్సలు అవసరమని గుర్తించారు. వారికి వెంటనే పరీక్షలు చేపడతామని తెలిపారు. అనంతరం సేవా సమితి కమిటి వారు మాట్లాడుతు ప్రతి ఏడాది ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేలా చర్యలు చేపడతామని తెలిపారు. శిబిరంలో సేవా సమితి సెక్రటరీ నాసరయ్య, మెంబర్లు చిటిపోతు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, బ్రహ్మానందం, భాస్కరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దేవాంగపురి పంచాయతీ కార్యదర్శిపై విచారణ

ఆదేశాలిచ్చిన డీపీవో

దేవాంగపురి(చీరాలటౌన్), జూలై 7 : చీరాల మండల పరిధిలోని దేవాంగపురి పంచాయతీ కార్యదర్శి మురళీ బాపూజీపై విచారణకు డీపీవో రవికుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ విచారణకు చీరాల డివిజనల్ పంచాయతీ అధికారిని నియమించారు. గ్రామంలోని శ్మశానాలను ధ్వంసం చేసి ఆక్రమణలకు పాల్పడినట్లు, అక్రమ రిజిస్ట్రేషన్‌లు, అక్రమ లే-అవుట్‌లు నెలకొనేందుకు సెక్రటరీ సహకరించినట్లు సామాజిక వేత్త దాసరి ఇమ్మానియేల్ ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేసేందుకు అధికారులు పూనుకున్నారు. ఈమేరకు అధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

తప్పుడు వార్తలపై బీసీ నేతల ఆగ్రహం

చీరాలటౌన్, జూలై 7 : ఆదివారం ఓ ప్రధాన పత్రికలో వెలువడిన కథనంపై పలువురు బీసీ, టీడీపీ నాయకులు మండి పడ్డారు. అసత్య ప్రచారం చేస్తూ నాయకునిపై బురద జల్లే విధంగా వార్తలు రాయడం అన్యాయమన్నారు. ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

12న మండల సర్వసభ్య సమావేశం

బల్లికురవ, జూలై 7 : మండల ప్రజా పరిషత్ కార్యాలయ సర్వసభ్య సమావేశం ఈ నెల 12న ఎంపీపీ శ్రీలక్ష్మీ అధ్యక్షతన జరుగుతందని ఎంపీడీవో హనుమారెడ్డి తెలిపారు. ఈసమావేశంలో గత మూడు మాసాల వ్యవధిలో మండలంలోని జరిగిన అభివృద్ధి పనులు, చేపట్టబోయే పనులపై సమీక్ష సమావేశం జరుగుతుందని అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

రేణుకమ్మకు మొక్కు తీర్చుకున్న టీడీపీ నేతలు

పంగులూరు, జూలై 7 : మండలంలోని చందలూరు గ్రామంలోగల రేణుకమ్మ తల్లి ఆలయంలో కొప్పోలు హరితతో పాటు స్థానిక టీడీపీ నేతలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. గడిచిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కూటమి అభ్యర్థిగా గొట్టిపాటి రవికుమార్ గెలవడంతోపాటు మంత్రి పదవిని చేపడితే అమ్మ వారికి 100 కొబ్బరి కాయలతో పూజలు చేస్తామని కొప్పోలు హరిత మొక్కుకున్నారు. కోరిక నెరవేరడంతో మంత్రి పదవి చేపట్టడంతో జడ్పీటీసీ మాజీ సభ్యు డు కరి వెంకట సుబ్బారావు, గ్రామ సర్పంచ్ పెంట్యాల కిష్టారావుతో పాటు చిట్టాబత్తిన వంశస్తులు, మహిళా భక్తులతో కలసి ఆదివారం అమ్మవారి ఆలయంలో హరిత అమ్మవారికి తమ మొక్కుచెల్లించారు. కార్యక్రమంలో పెంట్యాల రామలింగస్వామి, వెంకటేశ్వర్లు (సిద్ధూ), శేషారావు, రామాంజనేయులు, సుబ్బారావు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు